
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

కర్నూలు

జిల్లా వార్తలు 5

మంగళవారం 24 డిసెంబరు 2024



సీ.క్యాంప్ రైతు బజార్ పక్కన విద్యుద్దీపకాంతుల్లో ప్రార్థనా మందిరం





క్రిస్మస్ కాంతులు

కర్నూలు (కల్చరల్), డిసెంబరు 23: క్రైస్తవులకు ఆరాధ్యమైన వేడుక క్రిస్మస్ మరో రెండు రోజుల్లో విచ్చేస్తుండగా, నగరంలో క్రిస్మస్ వేడుక సందడి బాగా కానవస్తోంది. ఇప్పటికే వివిధ చర్చిలలో ముందస్తు క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారు. అలాగే క్యాండిల్ లైటింగ్ కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. క్రిస్మస్ సందర్భంగా వివిధ చర్చిలను విద్యుద్దీపాలతో అలంకరించారు. ఇక నగరంలో క్రిస్మస్ వేడుకలకు సంబంధించిన క్రిస్మస్ స్టార్లు, క్రిస్మస్ ట్రీలు, వివిధ అలకంరణ సామగ్రి అమ్మకాల జోరు పెరిగింది. క్రైస్తవులు తప్పని సరిగా తమ ఇంటిపైన క్రిస్మస్ స్టార్లు వేలాడదీస్తారు.






క్రీస్తు ప్రభువు తమ ఇంట జన్మించాడని ప్రతీకగా ఈ నక్షత్రాన్ని ఇంటిపైన వేలాడదీయడం ఒక సంప్రదాయంగా వస్తోంది. ఈ నేపథ్యంలో నగరంలో క్రిస్మస్ స్టార్ల కొనుగోళ్లకు డిమాండ్ పెరిగింది. వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా కాగితం, ప్లాస్టిక్, రబ్బర్ వంటి వాటితో వీటిని తయారు చేస్తున్నారు. అలాగే గృహాల్లో ఏర్పాటు చేసుకునే క్రిస్మస్ ట్రీలు, క్రిస్మస్ రోజున పిల్లలకు మిఠాయిలు పంచే ఎరుపు, తెలుపు రంగుల్లోని శాంతాక్లాజ్ టోపీలు, శాంతాక్లాజ్ కోట్లు, క్రిస్మస్ ట్రీలను అలంకరించే కానుకల బాక్సులు వంటివి అందుబాటులో ఉంటున్నాయి. నగరంలో పాత బస్టాండు, అబ్దుల్లాఖాన్ ఎస్టేట్, మద్దూరునగర్, సి.క్యాంపు, నంద్యాల చెక్‌పోస్టు తదితర ప్రాంతాల్లో వ్యాపారులు క్రిస్మస్ వేడుకల సామగ్రిని అమ్మకాలు చేస్తున్నారు.



నగరంలోని అబ్దుల్లాఖాన్ ఎస్టేట్ సమీపంలో క్రిస్మస్ పండుగ మెటీరియల్స్‌ను కొనుగోలు చేస్తున్న యువకులు



ఏడిపిస్తున్న ఎండు మిర్చి

- భారీగా తగ్గిన ధరతో రైతన్న దిగాలు
- గరిష్ఠం రూ.14,913.. కనిష్ఠం 1,599
- మొక్కజొన్నదీ అదే దారి



మార్కెట్‌యార్డుకు విక్రయానికి వచ్చిన ఎండుమిర్చి బస్తాలు

కర్నూలు అగ్రికల్చర్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఎండు మిర్చి ధర పతనమైంది. గత నెల క్వింటం రూ.20 వేలకు పైగానే ఉండగా ప్రస్తుతం సోమవారం గరిష్ఠ ధర క్వింటానికి రూ.14,913 పలికింది. మధ్యస్థ ధర రూ.11,119, కనిష్ఠ ధర ఘోరంగా రూ.1,599 మాత్రమే రైతుకు దక్కింది. మొక్కజొన్నలకు మద్దతు ధర కంటే ఎక్కువ క్వింటానికి రూ.2,350 దక్కగా సోమవారం రూ.2,052 మాత్రమే దక్కింది. కందుల ధర కూడా అదే దారిలో పతనమైంది. గరిష్ఠ ధర రూ.7,449, మధ్యస్థ ధర రూ.5,896, కనిష్ఠ ధర రూ.1,460 మాత్రమే రైతుకు అందింది. అదేవిధంగా వేరుశనగ కాయలకు గత సంవత్సరం ఇదే సమయానికి గరిష్ఠ ధర రూ.8వేలు అందగా ప్రస్తుతం గరిష్ఠ ధర క్వింటానికి రూ.6,010, మధ్యస్థ ధర రూ.5,409, కనిష్ఠ ధర రూ.4,221 మాత్రమే అందింది. పూల విత్తనాలకు గరిష్ఠ, మధ్యస్థ ధరలు రూ.4,019 కాగా, కనిష్ఠ ధర రూ.3,789 దక్కింది. ఆముదాలకు గరిష్ఠ, మధ్యస్థ ధరలు రూ.5,607, కనిష్ఠ ధరూ.5,009 వచ్చింది. ఉల్లిగడ్డల ధర పూర్తిగా తగ్గిపోయింది. మొన్నటి దాకా క్వింటానికి రూ.4,500 దక్కగా, సోమవారం గరిష్ఠ ధర రూ.3,200, మధ్యస్థ ధర రూ.2,931, కనిష్ఠ ధర రూ.1,331 మాత్రమే పలికింది. కొర్రలు గరిష్ఠ ధర రూ.2,551, మధ్యస్థ ధర రూ.2,441, కనిష్ఠ ధర రూ.1,629 అందింది. సజ్జలకు గరిష్ఠ ధర రూ.2,403, మధ్యస్థ ధర రూ.1,959, కనిష్ఠ ధర రూ.1,959 దక్కిందని సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ జయలక్ష్మి, అసిస్టెంట్ సెక్రటరీ వెంకటేశ్వర్లు తెలిపారు.

పత్తి కొనుగోలుకు తాత్కాలిక బ్రేక్



ఆదోని అగ్రికల్చర్, డిసెంబరు23 (ఆంధ్రజ్యోతి): ఆదోని సీసీఐ కేంద్రంలో మూడు రోజుల పాటు పత్తి కొనుగోలును నిలిపివేస్తున్నట్లు సీసీఐ కేంద్ర ఇన్‌చార్జ్‌లు భరత్, గౌతమ్ సోమవారం తెలిపారు. 26వ తేదీ వరకు ఎలాంటి కొనుగోళ్లు ఉండవని స్పష్టం చేశారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన పత్తి పరిశ్రమల్లో ఎక్కువగా నిల్వ ఉందని స్థలం ప్రభావం వల్ల మూడు రోజుల పాటు తాత్కాలికంగా పత్తి క్రయవిక్రయాలను నిలుపుదల చేస్తున్నామన్నారు. రైతులు యథావిధిగా ఈనెల 27నుంచి సీసీఐకి పత్తిని విక్రయించుకోవచ్చని సూచించారు. అప్పటివరకు రైతులు పరిశ్రమలకు సీసీఐకి విక్రయించుకునేందుకు తమ పత్తిని తీసుకోరావద్దని కోరారు.

జగన్నాథగట్టుపై పిల్లర్ల దశలోనే ఆగిపోయిన రాయలసీమ యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీ



అదే దుస్థితి

వైసీపీ ప్రభుత్వ హయాంలో ఐదెకరాల్లో రాయలసీమ ఇంజనీరింగ్ కళాశాలకు శాశ్వత భవనాల నిర్మాణం రూసా నిధులతో చేపట్టారు. అయితే మూడేళ్ల క్రితం జగన్ ప్రభుత్వం బిల్లులు మంజూరు చేయలేదు. దీంతో కాంట్రాక్టర్ పిల్లర్ల దగ్గర పనులు ఆపేశాడు. రూసా కాలేజీస్ స్టేట్ కౌన్సిల్ చైర్మన్ కార్యాలయంలో ఫైలు ఆగిపోయింది. వైసీపీ రంగు పూసుకున్న అధికారులే ఉండడంతో ముందుకు కదలలేదు. భవనాల పిల్లర్లకు వేసిన ఇనుప కడ్డీలు తుప్పుపట్టాయి. వాటిపైనే మళ్లీ పనులు చేపడితే ప్రమాదకరమని నిపుణులు అంటున్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా పరిస్థితి మారలేదు. అదే దుస్థితి కొనసాగుతోంది. రాయలసీమ యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల భవన నిర్మాణాల దుస్థితిపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

- ఇంజనీరింగ్ కాలేజీకి జగన్ శాపం..!
- జగన్నాథ గట్టుపై శాశ్వత భవనాలకు రూ.10 కోట్ల రూసా నిధులు
- నిధులు ఇవ్వకపోవడంతో ఆగిపోయిన పనులు
- మూడేళ్ల క్రితం పిల్లర్ల వద్దే ఆగిన నిర్మాణాలు
- తుప్పుబట్టిన ఇనుప కడ్డీలు
- ఇప్పటికీ స్పందించని కూటమి ప్రభుత్వం



తుప్పుబట్టిన పిల్లర్ల ఇనుప కడ్డీలు

కర్నూలు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక విద్యను నిరుపేద విద్యార్థులకు అందుబాటులో తీసుకురావాలనే సంకల్పంతో రాయలసీమ యూనివర్సిటీ అను బంధంగా ఇంజనీరింగ్ కాలేజీ ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఈ కాలేజీ ఆర్‌యూ క్యాంపస్‌లో కొనసాగుతోంది. సీఈసీ, ఈసీఈ, మెకానికల్, సివిల్, ఆర్టిఫిషియల్ ఇంజనీరింగ్ (ఏఐ) ఇలా వివిధ గ్రూపుల్లో దాదాపుగా వెయ్యి మందికి పైగా విద్యార్థులు చదువుకుంటున్నారు. ఇంజనీరింగ్ కళాశాలకు ప్రత్యేక క్యాంపస్ ఉండాలనే ఆశయంతో జగన్నాథ గట్టుపై రాష్ట్ర ప్రభుత్వం ఐదెకరాల భూమి కేటాయించింది. ఒక్కో బ్లాక్ 2,800 చదరపు అడుగుల విస్తీర్ణం చొప్పున 5,600 చదరపు అడుగుల విస్తీర్ణంలో రెండు బ్లాకులు డిజైన్ చేశారు. రూ.10 కోట్లు రూసా నిధులు నిధులు మంజూరు చేశారు. 2021లో టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి నిబంధనలు ప్రకారం సాయి పవర్ కన్‌స్ట్రక్షన్ సంస్థ నిర్మాణాలు అప్పగించారు. 18 నెలల్లో పనులు పూర్తి చేయాలని పనులు పర్యవేక్షిస్తున్న ఆంధ్రప్రదేశ్ ఎడ్యుకేషన్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఈడబ్ల్యూఐడీసీ) సంస్థ ఇంజనీర్లు కాంట్రాక్ట్ సంస్థతో ఒప్పందం చేసుకున్నారు. ఒప్పందం ప్రకారం 2022 విద్యా సంవత్సరం ప్రారంభంలోగా భవన నిర్మాణాలు పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాల్సి ఉంది. అయితే.. గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం, ఆనాడు జిల్లా ఇన్‌చార్జి, ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి పట్టించుకోకపోవడం వల్ల నిధులు మంజూరు చేయలేదు.

మిగతా 6లో

సమస్యల పరిష్కారంలో జాప్యం వద్దు

జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య



వినతులు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ డా.నవ్య

కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పీజీఆర్ఎస్ లాగిన్‌లో వచ్చిన అర్జీలను జాప్యం లేకుండా ఎప్పటికప్పుడు చూడాలని జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం ద్వారా జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఫిర్యాదుల స్వీకరణ అనంతరం జాయింట్ కలెక్టర్ ఫిర్యాదుల పరిష్కారాలపై అధికారులతో సమీక్షించారు. పీజీఆరెస్‌కు సంబంధించి వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు ఓపెన్ చేసి చూడాలని, ఎట్ టూ వ్యూ ఉండకుండా చూడాలన్నారు. ఇప్పటికీ సుమారు ఐదు వేల అర్జీల వరకు వచ్చాయని, వాటన్నింటినీ ఒకేసారి చేయడం వల్ల అర్జీల పరిష్కారంలో నాణ్యత లోపించే అవకాశం ఉంటుందని, అలా కాకుండా చిన్న చిన్న అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలన్నారు.

- ప్రైమరీ అగ్రికల్చర్ కో-ఆరేటివ్ సొసైటీ సభ్యుల వివరాలను సచివాలయ సిబ్బంది పరిశీలించి వారి ఈకేవైసీ డేటాను వెరిఫై చేసి పరిశీలించాలని అన్నారు. పంచాయతీకి ఆస్తులు (ఏ, బీ, సీ రిజిస్టర్లలో) ఉన్న వాటిని పంచాయతీ సెక్రటరీ, వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీ ద్వారా క్యాప్చర్ చేయించాలని తహసీల్దార్లు, ఎంపీడీవోలను జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. అదేవిధంగా హౌస్ టూ హౌస్ ద్వారా అందనినీ మ్యాప్ చేయడంతో పాటు ల్యాండ్‌కు మిస్ కాకుండా వాటిని కూడా మ్యాపింగ్ చేయాలని వీఆర్వోలు, సచివాలయ సిబ్బందితో మ్యాప్ చేయించాలన్నారు. రెవెన్యూ సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించుకుని అందరూ సర్వేలో అందరూ మ్యాప య్యేలా చూడాలన్నారు. సమావేశంలో డీఆర్వో వెంకట నారాయణమ్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు చిరంజీవి, కొండయ్య పాల్గొన్నారు.

93 ఫిర్యాదులు

ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన ఏఎస్పీ



బాధితుడితో మాట్లాడుతున్న ఏఎస్పీ అడ్మిన్ జి.హుస్సేన్ పీరా

కర్నూలు క్రైం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఎస్పీ క్యాంపు కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో 93 ఫిర్యాదులు వచ్చాయి. ఎస్పీ అందుబాటులో లేకపోవడంతో ఏఎస్పీ (అడ్మిన్) జి.హుస్సేన్ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. తన కుమారులు పట్టించుకోవడం లేదని, న్యాయం చేయాలని వెల్దుర్తి మండలం అల్లుగుండు గ్రామానికి చెందిన లలితమ్మ ఫిర్యాదు చేసింది. రుణాల పేరిట కర్నూలుకు చెందిన విజయ్ అనే వ్యక్తి రూ.75 లక్షలు కాజేశారని కల్లూరుకు చెందిన వీరేష్ ఫిర్యాదు చేశారు. జొన్న పంటను దున్నించి నాశనం చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని పత్తికొండ మండలం పుచ్చకాయలమడ గ్రామానికి చెందిన సుంకేశులు ఫిర్యాదు చేశారు. పత్తికొండ ప్రభుత్వ పాఠశాలలో కంప్యూటర్ ఆపరేటర్ ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి కర్నూలు చెందిన శ్రావణ్ కుమార్, మధుకిరణ్ రూ.1.75 లక్షలు తీసుకుని మోసం చేశారని పత్తికొండ మండలం బుగ్గతాండ గ్రామానికి చెందిన శివ నాయక్ ఫిర్యాదు చేశారు. రెస్టారెంటులో పని చేసే ప్రదీప్ అనే వ్యక్తి మొబైల్ తీసుకుని వెళ్లాడని, రూ.82వేలు మొబైల్ ఫోన్ పే ద్వారా మహారాష్ట్ర గ్రామీణ బ్యాంకుకు ట్రాన్స్‌ఫర్ చేసుకున్నాడని, అతనిపై చర్యలు తీసుకోవాలని ఆదోని శ్రీనివాసభవన్ రెస్టారెంట్‌కు చెందిన కె.చైతన్య ఫిర్యాదు చేశాడు. ఎల్ఐసీ కార్యాలయంలో పని చేసే కొంత మంది వ్యక్తులు అనారోగ్య బాధితులకు బీమా పేరుతో మోసగిస్తున్నారని శివకుమార్ ఫిర్యాదు చేశాడు.

రైతుపై రోకటిపోటు

- అన్నదాతలకు కష్టాల మీద కష్టాలు
- భారీగా పెరిగిన ఎరువుల ధరలు



యూరియా, డీఏపీ ఎరువుల

కర్నూలు అగ్రికల్చర్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): అన్నదాతల పరిస్థితి గోరుచుట్టుపై రోకటి పోటులా తయారైంది. గిట్టుబాటు ధర అందక నష్టాలపాలైన అన్నదాతను ఎరువుల ధరలు ఆందోళనకు గురి చేస్తున్నాయి. భారీగా ఎరువుల ధరలు పెరగడంతో రైతన్న నెత్తిపై పిడుగుపడినట్టయింది. బస్తాకు రూ.100 నుంచి రూ.200 వరకు పెరగడంతో అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు. ఉమ్మడి జిల్లాలో ఏటా ఖరీఫ్, రబీ సీజన్‌లలో ఐదు లక్షల టన్నుల రసాయనిక ఎరువులు వినియోగిస్తున్నారు. బస్తా ఎరువుపై రూ.100 నుంచి 200 వరకు ఎరువు ధరలు పెంచడంతో టన్ను (పది క్వింటాళ్లు)కు రూ.2 వేలు పెరిగింది. త్వరలోనే డీఏపీ ధర కూడా పెరిగే అవకాశం ఉన్నట్లు ఎరువుల డీలర్లు చెబుతున్నారు. కర్నూలు, నంద్యాల జిల్లాలో భారీ ఎత్తున ఎరువుల వినియోగం ఉంటుంది. ఒక రైతు ఒక ఎకరా పొలంలో నాలుగు బస్తాల యూరియాను వాడితే.. పక్క పొలంలో ఇంకో రైతు 8 బస్తాల ఎరువును వాడుతున్నాడు. పత్తికొండ, ఆదోని, ఎమ్మిగనూరు, ఆలూరు, తదితర మండలాలతో పాటు నంద్యాల జిల్లాలోని ఆత్మకూరు, నందికొట్కూరు, పాణ్యం, బనగానపల్లె, డోన్ మండలాల్లో పెద్ద ఎత్తున ఎరువుల వినియోగం జరుగుతోంది. పెరిగిన ఎరువుల ధరలను దృష్టిలో ఉంచుకుని తక్కువ ధరకు లభించే యూరియాను కొనుగోలు చేసేందుకు రైతులు పెద్ద ఎత్తున దుకాణాల ముందు ఎగబడుతున్నారు. అయితే రైతుల అవసరాలను తమకు అనుకూలంగా మార్చుకుంటూ డీలర్లు బస్తా యూరియాపై రూ.100 దాకా వసూలు చేస్తుండటం ఆందోళన కలిగించే అంశం. రైతులు ఎక్కువగా ఉపయోగించే 20-20-0, 28-28-0, 14-35-14, 16-20-0, 10-26-26 రకం ఎరువుల ధరలను ప్రస్తుతం కంపెనీలు భారీగా పెంచేశాయి. ఒక్కో రైతుపై ఖరీఫ్, రబీ సీజన్లలో రూ.3వేల నుంచి రూ.5వేల వరకు అదనపు భారం పడనుంది.

ప్రస్తుత రబీ పంట కాలంలో డీఏపీ, కాంప్లెక్స్ తదితర ఎరువుల అవసరం ఉంది. రబీలో 1.17లక్షల హెక్టార్లలో రైతులు పంటలు సాగు చేస్తున్నారు. ఈ సీజన్‌లో లక్ష టన్నుల ఎరువులను రైతులు వినియోగిస్తున్నారు. ఇప్పటి దాకా జిల్లాకు కేవలం అన్ని ఎరువులు కలిపి 95,400 టన్నులు ఎరువులు మాత్రమే సప్లయ్ చేశారు. యూరియా 29,567, డీఏపీ 6,850, ఎంవోపీ 2590, కాంప్లెక్స్ 60,900, ఎస్ఎస్‌పీ 1,020 టన్నులు మాత్రమే సరఫరా అయ్యాయి.

పెరిగిన ధరలు ఇలా

ఎరువు (రకం)	పాత ధర (రూ.లలో)	కొత్త ధర (రూ.లలో)
13-26-26	రూ.1,370	రూ.1,470
28-28-0	రూ.1,680	రూ.1,800
20-20-0-13	రూ.1,100	రూ.1,300
14-35-14	రూ.1,680	రూ.1,800
16-20-0-13	రూ.1,150	రూ.1,250

అవగాహనే అస్త్రం..!





- వినియోగదారుల హక్కుల రక్షణకు బలమైన చట్టాలు
- ప్రజల్లో కొరవడిన అవగాహన
- నేడు జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవం

కర్నూలు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి):

కొనే వస్తువులోనూ.. సేవల్లోనూ లోపం లేకుండా సరైన ధర, తూకం, నాణ్యత, స్వచ్ఛత కలిగినవి పొందే హక్కులు వినియోగదారులకు చట్టం కల్పించింది. ప్రస్తుత సమాజంలో లాభాపేక్ష.. ధనాపేక్ష కారణంగా మోసాలు పెరిగిపోతున్నాయి. పాలు, నీళ్లనూ సైతం యథేచ్ఛగా కల్తీ చేస్తున్నారు. ఇక తూకాల్లోనూ భారీగా తేడాలు ఉంటున్నాయి. అనారోగ్యంతో ఆస్పత్రులకు వెళ్తే అక్కడా మోసాలు తప్పడం లేదు. అన్నదాతలు ఆరుగాలం కష్టపడి పండించే పంట దిగుబడులు అమ్మకానికి మార్కెట్‌కు తీసుకెళ్తే తూకాల్లో మోసాలు జరుగుతన్నాయి. వీటిపై ఎవరైనా ప్రశ్నిస్తేనో, నిలదీస్తేనో తప్పా న్యాయం జరడం లేదు. ఈ తరహా మోసాలు అరికట్టాలంటే వినియోగదారులు మేల్కోవాలి. హక్కులు తెలుసుకోవాలి. మంగళవారం జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా వినియోదారుల హక్కుల చట్టం, ఫిర్యాదులు ఎలా చేయాలి, జిల్లా వినియోగదారుల కమిషన్ సాధించిన విజయాలు.. వంటి వివరాలపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

ఇదీ చట్టం

భారత ప్రభుత్వం వినియోగదారుల రక్షణకు 1986లో ఒక విప్లవాత్మకమైన చట్టం తీసుకొచ్చింది. వినియోగదారుల హక్కుల రక్షణ కోసం 1985 ఏప్రిల్ 9న ఐక్యరాజ్యసమితి రూపొందించిన మార్గదర్శక సూత్రాలను సభ్యదేశాలు ఆమోదించాయి. 1986లో వినియోగదారుల హక్కుల రక్షణ బిల్లును పార్లమెంట్ ఆమోదించింది. 1986 డిసెంబరు 24న రాష్ట్రపతి ఆమోద ముద్ర వేశారు. ఆనాటి నుంచి ఏటా డిసెంబరు 24న జాతీయ వినియోగదారుల దినోత్సవం జరుపుకుంటున్నాం. ఈ చట్టాన్ని అమలు చేయడానికి ప్రభుత్వం ప్రతి జిల్లా కేంద్రంలో కన్స్యూమర్ డిస్ప్యూట్స్ రిడ్రెసల్ కమిషన్ ఫోరం' ఏర్పాటు చేశారు. జిల్లా, రాష్ట్ర, కేంద్ర స్థాయి మూడు విభాగాలుగా ఫోరం విభజించారు.

కమిషన్‌ను ఎప్పుడు ఆశ్రయించాలంటే..!



ఆన్‌లైన్ సేవలు విస్తృతం కావడంతో ఇంటి నుంచి వివిధ వస్తువులు కొనుగోలుకు ప్రజలు ఆసక్తి చూపుతున్న నేపథ్యంలో ఆన్‌లైన్ వ్యాపార లావాదేవీలను కూడా వినియోగదారుల రక్షణ చట్టం-2019 పరిధిలోకి కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చింది. కొనుగోలు చేసిన వస్తువుల్లో నాణ్యత లోపించినా, వాటి వల్ల నష్టం వాటిల్లినా, తూకాల్లో మోసాలకు పాల్పడినా, పరిహారం కోరే హక్కు ఉంది. నాణ్యతలేని, కల్తీ సరుకులు విక్రయించినప్పుడు, కాలం చెల్లిన ఔషదాలు అమ్మినా, గరిష్ఠ చిల్లర ధర కంటే ఎక్కువకు విక్రయించినా, ప్రైవేటు వైద్యుల నిర్లక్ష్యం, సేవాలోపం కారణంగా నష్టం వాటిల్లినా, ఎలక్ట్రానిక్ పరికరాలు సక్రమంగా పని చేయకపోయినా, విత్తనాలు, ఎరువులు, పురుగు ముందులు కల్తీ జరిగినా, బ్యాంకులు, విద్యుత్ సంస్థలు, విమానయాన సంస్థలు, బీమా సంస్థలు, అందించే సేవల్లో ఏమైనా లోపాలు ఉంటే వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించి న్యాయం పొందవచ్చు. ఈ-కామర్స్ సంస్థలు అన్నికూడా వినియోగదారుల రక్షణ చట్టం పరిధిలోకి వస్తాయి.

హక్కులు.. భద్రత.. బాధ్యత

కొనుగోలు చేసే వస్తువులు, పొందే సేవలు వినియోగదారుల రక్షణ అవసరాలు తీర్చడమే కాకుండా సుదీర్ఘ కాలంగా మన్నేలా ఉండాలి. అవి వారి జీవితాలకు, ఆస్తులకు నష్టం కలిగించేలా ఉండకూడదు. భద్రత పొందడం కోసం కొనుగోలు చేసే వస్తువుల నాణ్యతా నిర్ధారించుకోవాల్సి ఉంటుంది. మార్కెట్ మాయాజాలంలో కల్తీలు, మోసాలు పెరిగిపోవడంతో వీలైనంత వరకు ఐఎస్‌ఐ, ఆగ్ మార్క్, హాల్ మార్క్.. వంటి నాణ్యతా చిహ్నాలు కలిగిన వస్తువులను కొనుగోలు చేయడం ఉత్తమం. వస్తువుల ఉత్పత్తి వ్యయం, వ్యాపారి లాభం, చెల్లించాల్సిన పన్నులు కలిపే ఎమ్మార్పీ నిర్ణయిస్తారు. ఆ ధర కంటే అదనంగా వసులు చేసినా తప్పే. ఏ వస్తువు కొనుగోలు చేసినా, సేవలు పొందినా బిల్లు, వస్తువుల గ్యారెంటీ.. వారెంటీ కార్డులపై దుకాణ యజమాని సంతకం, ముద్రతో సహా తీసుకోవాలి.

జిల్లా కమిషన్ పరిష్కరించిన ఫిర్యాదులు...

- కర్నూలు నగరానికి చెందిన ఎ.రంగారెడ్డి స్థానిక సోనోవిజన్ షోరూంలో కూలర్ కొనుగోలు చేశాడు. లక్కీడ్రాలో మొదటి విజేతకు ఆల్టో కారు ఇస్తామని హామీ ఇచ్చారు. లక్కీడ్రాను సంక్రాంతి సందర్భంగా జనవరిలో పూర్తి చేయగా.. వినియోదారులను మభ్యపెడుతూ అదే కూపన్లు రెండు నెలలు తరువాత మార్చిలో జరీ చేశారు. దీనిపై వినియోగదారుల కమిషన్‌లో ఫిర్యాదు చేయగా ఫిర్యాదుదారుడికి ఆల్టోకారు లేదా రూ.4.50 లక్షలు చెల్లించాలని ఫోరం తీర్పు ఇచ్చింది.
- ఎమ్మిగనూరు మండలం కందనాతి గ్రామానికి చెందిన శంఖం రాజగోపాల్‌రెడ్డి రూ.1.87 లక్షలు విలువైన నాలుగున్నర తులాల బంగారం 2018 జూన్‌లో మణప్పురం ఫైనాన్స్ సంస్థలో తనఖా పెట్టి రూ.85 వేలు రుణం తీసుకున్నాడు. రాజగోపాల్‌రెడ్డి ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఫైనాన్స్ సంస్థ బంగారాన్ని వేలం వేసింది. దీంతో బాధితుడు ఫోరంను ఆశ్రయించగా.. విచారించిన వినియోగదారుల ఫోరం బాధితుడికి రూ.లక్ష పరిహారం, కోర్టు ఖర్చులకు మరో రూ.5 వేలు ఇవ్వాలని ఆదేశించింది.
- గూడూరు మండలానికి చెందిన మెడికల్ రిప్రజెంటేటివ్ ఒకరు 2021 నుంచి 2024 వరకు అమలులో ఉండే ఆదిత్య బీమా సంస్థ నుంచి రూ.25 లక్షల బీమా పాలసీ తీసుకున్నాడు. పాలసీదారుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. బీమా పరిహారం ఇచ్చేందుకు సదరు సంస్థ నిరాకరించడంతో బాధిత కుటుంబం కమిషన్‌ను ఆశ్రయించింది. విచారించిన ఫోరం రూ.25 లక్షలు బీమా మొత్తంతో పాటు కోర్టు ఖర్చులు రూ.50 వేలు ఇవ్వాలని తీర్పు ఇచ్చింది.
- కల్లూరు మండలం పెద్దపాడు గ్రామానికి చెందిన రైతు వి.పరమేశ్వరరెడ్డితో పాటు మరికొందరు రైతులు 571 బస్తాల కందిపప్పు నన్నూరు సమీపంలోని శ్రీలక్ష్మి వెంకటేశ్వర కోల్డ్ స్టోరేజీలో ఏడాది పాటు నిల్వ చేశారు. ఆ తరువాత వెళ్లి కందిపప్పు ఇవ్వమని రైతులు అడగగా.. కోల్డ్ స్టోరేజీ యాజమాన్యం స్పందించకపోవడంతో రైతులు వినియోగదారుల ఫోరంను ఆశ్రయించారు. విచారించిన ఫోరం ఆ కందిపప్పు విలువ రూ.12.50 లక్షలు 9 శాతం వడ్డీతో చెల్లించాలని వినియోగదారుల కమిషన్ చైర్మన్ కరణం కిశోర్‌కుమార్, సభ్యులు ఎన్.నారయణరెడ్డి, నజీమాకౌసర్లతో కూడిన బెంచ్ తీర్పు ఇచ్చింది.
- జిల్లా వినియోగదారుల కమిషన్ అధ్యక్షుడిగా కరణం కిశోర్‌కుమార్ బాధ్యతలు చేపట్టిన తరువాత మూడేళ్లలో 750 ఫిర్యాదులు పరిష్కరించారు. 2024 జనవరి నుంచి ఈ రోజు వరకు 200 వరకు ఫిర్యాదులు పరిష్కరించి వినియోగదారులకు న్యాయం చేశారు.



వాట్సాప్‌లోనూ ఫిర్యాదు చేయవచ్చు

జిల్లా వినియోగదారుల ఫారంలో చేసే ఫిర్యాదులను 90 రోజుల్లో పరిష్కరించేందుకు కృషి చేస్తాం. మధ్యవర్తిత్వం ద్వారా ఫిర్యాదులను పరిష్కరించి సత్వర న్యాయం అందించేందుకు కృషి చేస్తున్నాం. ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేసినా స్వీకరించి ప్రతివాదులకు నోటీసులు పంపించి.. వినియోగదారులకు అండగా నిలుస్తాం. ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరకు వస్తువులు విక్రయించినా, నాసిరకం ఉత్పత్తులు అంటగట్టి సేవా లోపానికి పాల్పడినా ఇంటి నుంచి వినియోగదారుల కమిషన్‌కు ఫిర్యాదు చేయవచ్చు. ఇందుకోసం కేంద్ర వినియోగదారుల మంత్రిత్వ శాఖ 'వాట్సాప్ చాట్‌బాట్' సేవలను తీసుకొచ్చింది. వాట్సాప్ నంబరు 88000 01915కు ముందుగా హాయ్ అని టైప్ చేయాలి. అక్కడి నుంచి వచ్చే సూచనలు ఆధారంగా వివరాలు నమోదు చేస్తే జాతీయ వినియోగదరాల కమిషన్ హెల్ప్‌లైన్‌లో ఫిర్యాదు నమోదవుతుంది. ఆ తరువాత ఆ ఫిర్యాదు పరిష్కారం కోసం సంబంధిత జిల్లా వినియోగదారుల కమిషన్‌కు పంపుతారు. అలాగే.. 18001 14000 లేదా 1915 నంబరకు కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చు. నంబర్లు ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

– కరణం కిశోర్‌కమార్, అధ్యక్షుడు, జిల్లా వినియోగదారుల కమిషన్, కర్నూలు

ఏ ఫిర్యాదు ఎక్కడ.. ఎంత నగదు



- జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి మూడు స్థాయిలో కన్స్యూమర్ డిస్ప్యూట్స్ రిడ్రెసల్ కమిషన్ (వినియోగదారుల కమిషన్) పని చేస్తుంది. జిల్లా స్థాయి ఫోరం వస్తువులు/సేవల విలువ రూ.50 లక్షలలోపు ఫిర్యాదులు పరిష్కరిస్తుంది. రూ.కోటి నుంచి రూ.2 కోట్ల మధ్య రాష్ట్ర స్థాయి, రూ.2 కోట్లకు మించిన విలువ కలిగిన ఫిర్యాదులను జాతీయ స్థాయి ఫోరం పరిష్కరిస్తుంది.
- వస్తు సేవల్లో నష్టపోయి పరిహారం కోరాలనుకుంటే.. వివరాలను నాలుగు ప్రతులతో దరఖాస్తు చేయాలి. వస్తువుసేవల కొనుగోలు రుజువులు జతపర్చాలి. ఫోరం ఫీజు రూ.లక్ష నుంచి రూ.5 లక్షల వరకు రూ. రూ.200, రూ.5 - 10 లక్షల వరకు రూ.400, రూ.10 లక్షలు ఆపైన పరిహారం కోసం రూ.500 రుసుం చెల్లించాల్సి ఉంటుంది.
- ఫిర్యాదును పరిశీలించిన తరువాత ఫోరం స్వీకరించవచ్చు లేదా తిరస్కరించవచ్చు. వివిధ కారణాలతో తిరస్కరిస్తే ఫిర్యాదుదారుడు తనవాదన వినిపించవచ్చు. ఫోరంలో వినియోగదారుడే తన కేసును వాదించుకోవచ్చు లేదా న్యాయవాదిని నిమించుకోవచ్చు.

కోల్డ్ స్టోరేజీ ప్లాంటుకు మళ్లీ జీవం

రూ.6 కోట్లతో ప్రతిపాదనలు

కర్నూలు అగ్రికల్చర్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కర్నూలు మార్కెట్ యార్డులో నిలిచిన కోల్డ్ స్టోరేజీ ప్లాంటు నిర్మాణం మళ్లీ మొదలయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతో మధ్యలోనే పనులు నిలిచిపోయాయి. ఇటీవల మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ విజయ సునీత కోల్డ్ స్టోరేజీ ప్లాంటును పూర్తి చేసేందుకు వెంటనే ప్రతిపాదనలు పంపాలని ఆదేశాలు జారీ చేశారు. దాదాపు రూ.6 కోట్లతో ప్లాంటు నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని, ఆర్డీఎఫ్ నిధు లతో పూర్తి చేయడమా లేక బయటి మార్కెట్ కమిటీ యార్డుల నుంచి అప్పుగా రుణాలను తీసుకుని పూర్తి చేసే ఆలోచనలో ప్రభుత్వం ఉందని సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ జయలక్ష్మి తెలిపారు.



ముళ్లకంపల మధ్య నిలిచిపోయిన కోల్డ్ స్టోరేజీ ప్లాంటు నిర్మాణం

అదే దుస్థితి

(5వ పేజీ తరువాయి)



నిర్మాణ స్థలంలో తుప్పుబడుతున్న ఇనుము

ఆర్‌యూ ఇంజనీరింగ్ కాలేజీకి మొదట రూపాల సంగమేశ్వరుడు ఆలయం పక్కనే 5 ఎకరాలు స్థలం ఇచ్చారు. దీని మీద అభ్యంతరం రావడంతో ఆలయానికి దిగువన నాటి రెవిన్యూ అధికారులు భూమి కేటాయించారు. కొండ ప్రాంతం కావడంతో.. రాక్ కటింగ్ చేసి ఎగుడు దిగుడు లేకుండా చదును చేశారు. పునాదులు తీసి పిల్లర్లు (కాలమ్స్) వేశారు. దాదాపు రూ.2.50 కోట్లు ఖర్చు చేశారు. తొలి బిల్లు ఇవ్వాలని 2021 అక్టోబరులో రూసా కార్యాలయానికి పంపారు. ఆ ఫైల్ స్టేట్ కౌన్సిల్ చైర్మన్ కార్యాలయానికి చేరింది. ఆనాటి రాయలసీమ యూనివర్సిటీ అధికారులు పట్టించుకోలేదో.. నిధులు లేమితో ప్రభుత్వం కావాలనే ఆ ఫైలు పక్కన పెట్టిందోగాని 2021 డిసెంబరులో పిల్లర్ల వద్దే కాంట్రాక్టర్ పనులు ఆపేశారు. మూడేళ్లుగా ఎక్కడి పనులు అక్కడే అసంపూర్తిగా ఉన్నాయి. వైసీపీ ప్రభుత్వ హయాంలో రూసా నిధులు సకాలంలో వాడుకోకపోవడంతో వెనక్కి వెళ్లాయని అంటున్నారు.

బిల్లులు రాగానే పనులు మొదలుపెడతాం

జగన్నాథగట్టుపై ఐదు ఎకరాల్లో రాయలసీమ వర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల నిర్మాణాలు చేపట్టాం. ప్రభుత్వం రూసా నిధులు రూ.10 కోట్లు మంజూరు చేసింది. బిల్లులు రాలేదని కాంట్రాక్టరు పనులు ఆపేసిన మాట నిజమే. కాంట్రాక్ట్ సంస్థ ప్రతినిధులు, ఏపీఈడబ్ల్యూఐడీసీ ఇంజనీర్లతో రెండు రోజుల క్రితం మాట్లాడాను. బిల్లులు రాగానే పనులు చేపడతామని చెప్పారు. తుప్పు పట్టిన పిల్లర్ల ఇనుప కడ్డీలు నిర్మాణానికి ఉపయోగ పడుతాయో లేదో థర్డ్ పార్టీ సివిల్ ఇంజనీరింగ్ నిపుణులతో అధ్యయనం చేయిస్తాం. వాళ్ల ఇచ్చే నివేదిక ఆధారంగానే పనులు మొదలు పెడుతాం.

– ఎన్‌టీకే నాయక్, వైస్ చాన్సలర్, రాయలసీమ వర్సిటీ, కర్నూలు

టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా పనులు మొదలు కాలేదు. ఎప్పుడు మొదలు పెట్టేదీ చెప్పేవారు లేరు. పాత బిల్లులు ఇవ్వడం గురించి ఎలాంటి ప్రకటనా లేదు. తుప్పుపట్టిపోయిన ఇనుక కడ్డీల వ్యవహారం ఏం చేసేదీ చెప్పడం లేదు. కాకపోతే ఐఐటీ కళాశాల నిపుణులతో అధ్యయనం చేయించింది. వారు ఇచ్చిన నివేదిక ఆధారంగానే పనులు పునః ప్రారంభించే అవకాశం ఉంది. అంతకు మించి మూడేళ్లుగా ఆగిపోయిన ఇంజనీరింగ్ కళాశాల భవన నిర్మాణం గురించి స్పష్టమైన ప్రకటన ప్రభుత్వం నుంచి రాలేదు.

తుప్పుబట్టిన ఇనుప కడ్డీలు

కళాశాల భవనాల పునాదులు ఒక్కటే పూర్తి చేశారు. భూ మట్టం, బేస్‌మట్టం లెవల్‌లో పిల్లర్ల నిర్మాణాల కోసం ఇనుప కడ్డీలు ఏర్పాటు (సెంట్రింగ్) చేసి వదిలేశారు. మూడేళ్లుగా ఎండకు ఎండి.. వర్షాలకు తడవడంతో ఇనుప కడ్డీలు తుప్పు పట్టాయి. ఆ కడ్డీల పైనే మళ్లీ నిర్మాణాలు చేపడితే భవనాల నాణ్యత ప్రశ్నార్థకంగా మారుతుందని, జీవిత కాలం తగ్గిపోతుం దని సివిల్ ఇంజనీరింగ్ నిపుణులు పేర్కొంటున్నారు

మంత్రి టీజీ భరత్ జోక్యం చేసుకోవాలి

గత వైసీపీ ప్రభుత్వ నిర్వాకం వల్ల నేడు టీడీపీ కూటమి ప్రభుత్వానికి ఆదనపు భారం తప్పడం లేదు. అయితే.. గ్రామీణ నిరుపేద విద్యార్థుల సంక్షేమం దృష్ట్యా పరిశ్రమలు, వాణిజ్యం, ఆహార శుద్ధి శాఖ మంత్రి టీజీ భరత్ జోక్యం చేసుకోవాలి. ఆర్‌యూ అధికారులతో సమీక్ష నిర్వహించాలి. రాష్ట్ర మానవ వనరులు (విద్యా) శాఖ మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకు వెళ్లాలి. స్టేట్ కౌన్సిల్ చైర్మన్ కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్న ఫైలుకు మోక్షం కల్పించాలి.. ఆగిపోయిన ఇంజనీరింగ్ కాలేజీ పనులు మొదలు పెట్టాలని విద్యార్థులు కోరుతున్నారు.

400 ఏళ్ల నాటి రామదుర్గం చర్చి

ఆలూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆలూరు నియోజకవర్గంలోని ఓ చర్చికి నాలుగు శతాబ్దాల ఘన చరిత్ర ఉంది. మండలంలోని రామదుర్గం ప్రార్థనా మందిరాన్ని 400ఏళ్ల సంవత్సరాల క్రితం నిర్మించారు. 1780లో ఫాదర్ సెయింట్ అనే రామదుర్గం చర్చిని గోవా రిజిస్టర్‌లో రాయించారు. ఇది జరగక 150 ఏళ్లకు ముందు ఆదోనికి చెందిన మినుముల చిన్న నాగప్ప, పెద్ద నాగప్ప రామదుర్గంలో పునీత అన్నమ్మ చర్చి నిర్మించారు. చిన్న నాగప్ప, పెద్దనాగప్ప జొన్నల వ్యాపారం నిమిత్తం కోసం రాయచూరు వెళ్లారు. అక్కడ క్రైస్తవ గురువు కాటేటిస్టును కలుసుకున్నారు. ఆయన బోధనలతో వారు క్రైస్తవ మతాన్ని స్వీకరించి రామదుర్గం, ఆదోని ప్రాంతాల్లో చర్చిలు నిర్మించారు. ఆ తర్వాత గోవా క్రైస్తవ మిషన్ నుంచి వందలాది మంది విదేశీయులు రామదుర్గం చర్చిలో సేవలందించారు. ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో విదేశీయులు డైనవెర్ములిన్ అనే ఫాదర్ రామదుర్గంలో చర్చిలో స్థిరపడ్డారు. విద్య, వైద్యం చేస్తూ, కరవు కాలంలో ఆహార ధాన్యాలిచ్చి ప్రజలను ఆదుకున్నారు. ప్రస్తుతం రామదుర్గంలో రాతి కట్టడంతో ఉన్న చర్చిని 1972లో నిర్మించారు. కాల క్రమేణా పాలనా సౌలభ్యం కోసం ఆదోనికి మారింది. చిప్పగిరిలో రూ.1.50 కోట్ల వ్యయంతో ఫాతీమా ఆర్సీఎం పేరుతో పాఠశాల నిర్మించారు. ఈ గ్రామానికి చెందిన 16మంది పాదర్లు విదేశాల్లో, మన దేశంలోనూ మత బోధన చేస్తున్నారు. క్రిస్మస్ సందర్భంగా పండుగకు చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు, ఊరేగింపు, అన్నదానం చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. రామదుర్గంలో చర్చిలో ముందస్తు క్రిస్మస్ సంబరాలు మొదలయ్యాయి. ఐదు రోజుల పాటు జరిగే ఈ వేడుకలకు సోమవారం నిర్వాహకులు ఏర్పాటు పూర్తి చేశారు.



బ్రిటిష్ కాలం నాటి పురాతన చర్చి

దేశానికి సేవ చేసే ప్రతి పౌరుడు సైనికుడే..

రాష్ట్రపతి పోలీస్ మెడల్ గ్రహీత జవాన్ రామాంజనేయులు



వీరజవాన్ రామాంజికి స్వాగతం పలుకుతున్న విద్యార్థులు



పత్తికొండ, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): సరిహద్దులో దేశ రక్షణకు కోసం పని చేసేవారితో పాటు దేశానికి సేవ చేసే ప్రతి పౌరుడు సైనికుడే అని బీఎస్ఎఫ్ జవాన్ రామాంజనేయులు అన్నారు. రాష్ట్రపతి పోలీస్‌మెడల్ అందుకున్న బీఎస్ఎఫ్ జవాన్ రామాంజనేయులు సోమవారం స్వగ్రామం పత్తికొండకు వచ్చారు. ఈ సందర్భంగా జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో వీరజవాన్‌కు ఘనస్వాగతం పలికారు. విద్యార్థులు జాతీయ జెండాలతో స్వాగతం పలుకుతూ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం నాలుగు స్తంభాల కూడలిలో సీఐ జయన్న, బీజేపీ అసెంబ్లీ కోకన్వీనర్ గోవర్ధన్‌నాయుడు, న్యాయవాది సుధాకర్‌ల ఆధ్వర్యంలో జవాన్ రామాంజనేయులును సన్మానించారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల అధ్యాపకులు వీరేషప్ప, రామ్మోహన్, రాజేష్ తదితరులు ఉన్నారు.

భలా ధినేష్...

జాతీయ స్థాయిలో బంగారు పతకం



కర్నూలు స్పోర్ట్స్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన మున్నెప్ప వెంకట శ్రీనివాసులు, శోభా దంపతుల కుమారుడు మున్నెప్ప వెంకటశ్రీ దినేష్ 68వ జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్ (అండర్-16) గుజారియో కరాటే చాంపియన్‌షిప్‌లో బంగారు పతకం సాధించాడు. పోటీలు ఢిల్లీ నగరంలో జరిగాయి. ఆంధ్రప్రదేశ్ నుంచి ప్రాతినిధ్యం వహించి బంగారు పతం సాధించి పలువురు మార్షల్ ఆర్ట్స్‌కు ఆదర్శంగా నిలిచారు. తండ్రి హెచ్‌సీ సీసీఎస్ పోలీస్ స్టేషన్‌లో పోలీసు. దినేష్ తాతయ్య వెంకటరమణ విశ్రాంత పీఈటీ (ప్యాపిలి మండలం) కావడం విశేషం. జాతీయ స్థాయిలో బంగారు పతకంతో పాటు గతంలో వైజాగ్, గుంటూరు అనంతపురం, ముంబై, ఢిల్లీ, కేరళ, ఏషియన్స్ ఢిల్లీ, ఎంపీ పంజాబ్ ఇండోర్‌లో నిర్వహించిన రాష్ట్ర, జాతీయ స్థాయి కరాటే పోటీల్లో అనేక సార్లు పతకాలు సాధించాడు. జిల్లాలో ప్రభుత్వ అధికారులు కలెక్టర్ రంజిత్ బాషా, ఎస్పీ బిందుమాధవ్, డీఈవో శ్యామ్యూల్ పాల్, ఏఎస్పీతో అవార్డు, మెడల్స్ అందుకున్నాడు.



కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటూ..

మంత్రాలయం హుండీ ఆదాయం రూ.3.47 కోట్లు



హుండీని లెక్కిస్తున్న దృశ్యం

మంత్రాలయం, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠం హుండీ ఆదాయం రూ.3,46,84,817 నగదు వచ్చినట్లు మఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్లు వెంకటేష్ జోషి, శ్రీపతి ఆచార్, ఐపీ నరసింహమూర్తిలు తెలిపారు. సోమవారం నవంబరు మూడు రోజులతో పాటు డిసెంబరు 22 రోజుల వరకు సంబంధించిన 25 రోజుల హుండీని మఠం గురురాజాంగణ భవనంలో దేవదాయ శాఖ అధికారి బింధుబాయి ఆధ్వర్యంలో కట్టుదిట్టమైన భద్రత, సీసీ కెమెరాల నిఘా మధ్య శ్రీమఠంలోని 24 హుండీలను లెక్కించినట్లు తెలిపారు. రూ.3,46,84,817 నగదుతోపాటు 1.900 కేజీల వెండి, 64 గ్రాములు బంగారు, వివిధ దేశాల డాలర్లు వచ్చినట్లు చెప్పారు. ఈ హుండీ లెక్కింపులో ఈఈ సురేష్ కోణాపూర్, ఎస్టేట్ అధికారి బీ.శ్రీనివాసులు, సూపరింటెండెంట్లు అనంత పురాణిక్, రవికుల కర్ణి, జేపీ స్వామి, రమణరావు, కృష్ణమూర్తి, గిరిధర్, సుజ్ఞానేంద్ర, నవీన్, లక్ష్మీకాంత్, గురురాజ్ పాల్గొన్నారు.



తవ్వకాల్లో బయటపడ్డ తామ్రపత్రాలు



బయటపడ్డ వెండి, బంగారు నాణేలు





పంచమఠాల పునరుద్ధరణలో తామ్ర శాసనాలు

బంగారు, వెండి నాణేలు కూడా లభ్యం ● గ్రంథ రూపంలో తామ్రశాసనాల ప్రచురణకు దేవస్థానం నిర్ణయం

నంద్యాల, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం క్షేత్ర పరిధిలో దేవస్థానం చేపట్టిన పంచమఠాల పునరుద్ధరణ పనుల్లో పలు దఫాలుగా పురాతన తామ్రశాసనాలు, వెండి, బంగారు నాణేలు లభించాయి. ఏడో శతాబ్దం నుంచి 16వ శతాబ్దం మధ్య కాలంలో నిర్మించిన ఘంటామఠం, విభూతిమఠం, రుద్రాక్షమఠం, భీమ శంకరమఠం, సారంగధారమఠం అన్నీ కూడా ఆలయ నిర్మాణాన్ని పోలిఉంటాయి. ఈ మఠాలు శిథిలావస్థకు రావడంతో దేవస్థానం ప్రాచీన నిర్మాణశైలికి విఘాతం కలగకుండా జీర్ణోద్ధరణ పనులు చేపట్టి పునర్నిర్మాణం చేపట్టింది. ఈ క్రమంలో చేపట్టిన తవ్వకాల్లో పలు దఫాలుగా పురాతన తామ్రశాసనాలు, వెండి, బంగారు నాణేలు లభించాయి. లభించిన వాటిలో 53 తామ్ర శాసనాలు, 15 బంగారు నాణెలు, 265 వెండి నాణేలు, ఒక తామ్ర నాణెం లభించాయి. కాగా లభించిన తామ్ర శాసనాలు, నాణేల విశ్లేషణకు దేవస్థానం ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా సహకారాన్ని తీసుకుంది. ఈ శాసనాలన్నీ సంస్కృతం, తెలుగు, కన్నడ, ఒరియా భాషల్లో ఉన్నట్లుగా గుర్తించారు. ఇక నాణేలు ఆధునిక కాలంనాటివిగా చరిత్రకారులు భావిస్తున్నారు. ఈ శాసనాల్లోని విషయాలను ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా, మైసూరు వారు ప్రతి శాసనాన్ని విశేషించి శాసనాల్లోని చారిత్రక అంశాల వివరణను రూపొందిస్తుంది. పాఠకుల సౌకర్యార్థం దేవస్థానం ఈ శాసన గ్రంథాన్ని గ్రంథంగా ప్రచురించనుంది.

మాదక ద్రవ్యాలపై అవగాహన అవసరం

- ఆర్‌యూ ఇన్‌చార్జి ఉపకులపతి ఎన్‌టీకె నాయక్

కర్నూలు అర్బన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలతో పాటు సామాజిక రుగ్మతలపై యువతకు అవగాహన అవసరమని ఆర్‌యూ ఇన్‌చార్జి ఉపకులపతి, ప్రొఫెసర్ ఎన్‌టీకె నాయక్ అన్నారు. సోమవారం రాయలసీమ యూనివర్సిటీలో రాష్ట్ర లీగల్ సర్వీసు ఆథారిటీ, అమరావతితో పాటు జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సమన్వ యంతో ఎన్ఎస్ఎస్ విభాగం అవగాహన సదస్సు నిర్వహించారు. వ్యాస రచన, లఘు చిత్రాలు, మాదక ద్రవ్యాల దుర్వినియోగం, మానవ అక్రమ రవాణా. గుడ్ టచ్ - బ్యాడ్ టచ్, ర్యాగింగ్, బాల్యవివాహల గురించి పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ నాగరాజు, ప్రోగ్రాం ఆఫీసర్లు కె వెంకటరత్నం, బి.విజయుడు, నగచంద్రుడు, శివప్రసాదరెడ్డి పాల్గొన్నారు.

ప్రజలపై రూ.6 వేల కోట్ల భారం

- వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి



పోస్టర్‌ను విడుదల చేస్తున్న వైసీపీ నాయకులు

కర్నూలు న్యూసిటీ డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు కరెంటు చార్జీలు పెంచబోమని చెప్పిన చంద్రబాబు ప్రజలపై దాదాపు రూ.6వేల కోట్ల భారం మోపారని మాజీ ఎమ్మెల్యే, వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక వైసీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలా పెంచుకుంటూపోతే ఐదేళ్లలో ఏమి జరుగుతుందో ఊహించుకొని ప్రజలు భయానికి లోనవుతున్నారని అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంటు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని విమర్శించారు. కాలేజీ యాజమాన్యాలు కూడా విద్యార్థులను కళాశాలకు రానివ్వడం లేదన్నారు. పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కే శ్రీదేవి మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేయకుండా ప్రజలపై యూజర్ చార్జీలు వేయబోతున్నారని అన్నారు. అనంతరం వైసీపీ పోరుబాట పోస్టర్‌ను విడుదల చేశారు. సమావేశంలో వైసీపీ నాయకులు అహ్మద్ ఆలీఖాన్, సురేంద్రరెడ్డి పాల్గొన్నారు.

వినూత్న ఆలోచనలతో ఆవిష్కరణలు



వర్క్‌షాప్‌లో పాల్గొన్న అతిథులు, విద్యార్థులు

- ఉర్దూ వర్సిటీలో వర్క్ షాప్

కర్నూలు అర్బన్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు వినూత్న ఆలోచనలు చేసినప్పుడే నూతన ఆవిష్కరణలు జరుగుతాయని పద్మావతి మహిళా యూనివర్సిటీ డీఎస్ఐఆర్ ప్రొఫెసర్ పి.జోత్స్న అన్నారు. సోమవారం డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీలో డీఎస్ఐఆర్, టీటీసీఐసీ, ఉర్దూ వర్సిటీ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు వర్క్ షాపు జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇన్నోవేషన్‌పై దృష్టి సారించి జాబ్ సెక్టార్‌లో విద్యార్థులకు ఉద్యోగాలు దక్కేలా వారికి తర్ఫీదును ఇవ్వాలన్నారు. విద్యార్థులు కేవలం పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా కేంద్ర ప్రభుత్వం సైన్సు అండ్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ విద్యార్థులకు ప్రాజెక్టు ద్వారా పరిశోధనలకు ప్రోత్సహిస్తుదన్నారు. ఈ కార్యక్రమంలో ఉపకులపతి ప్రొఫెసర్ పీఎస్ షావలి ఖాన్, రిజిస్ట్రార్ లోకనాథ్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ మహబూబ్ బాషా పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

కొత్తపల్లి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముసలిమడుగు గ్రామ పొలిమేరలోని పొలాల్లో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్‌ఐ ఎం.కేశవ తెలిపారు. మండలంలోని ఎర్రమఠం గ్రామానికి చెందిన కొమ్ము శేఖర్ ముసలిమడుగు గ్రామ సరిహద్దుల్లో పచ్చజొన్న పంటను సాగు చేసుకున్నాడు. ఆ ప్రాంతంలో సోమవారం ఓ మృతదేహం పడి ఉండటాన్ని గమనించి గ్రామానికి చెందిన తలారీ మద్దిలేటి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహం కుళ్లిపోయి ఉండడాన్ని పరిశీలించి ఈ వ్యక్తి చనిపోయి సుమారు ఆరు రోజులైందని గుర్తించారు. వయస్సు 45 ఏళ్ల మధ్యలో ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. తలారి మద్దిలేటి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కేశవ తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

మంత్రాలయం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ ఎదురుగా ఎమ్మిగనూరు జాతీయ రహదారి పక్కన ఉన్న కానుగ చెట్టుకు గుర్తు తెలియని వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మంత్రాలయం ఎస్‌ఐ పరమేష్ నాయక్ తెలిపిన వివరాల మేరకు.. మంత్రాలయంలో గుజురు సామాన్లు వేరుకుంటూ జీవనం సాగించే వ్యక్తి ఆదివారం రాత్రి రాత్రి ఎవరూలేని సమయంలో చెట్టుకు ఉరి వేసుకున్నాడు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలానికి చేరుకుని ఎస్‌ఐ పరమేష్ నాయక్ పరిశీలించారు. గుర్తు తెలియని మృతదేహంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని ఎమ్మిగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

నంద్యాల క్రైం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని నంద్యాల పట్టణ డీఎస్పీ పి.శ్రీనివాసరెడ్డి అన్నారు. సోమవారం మధుమణి నర్సింగ్‌హోం సమావేశ భవనంలో వైద్యులు, న్యాయవాదులు, పోలీస్‌శాఖ కలిసి సదస్సు నిర్వహించారు. న్యాయకళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.షేక్‌మాలిక్ బాషా, ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డా.రవికృష్ణ, ఉపాధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి, రాష్ట్ర ఐఎంఏ మహిళా విభాగం కార్యదర్శి డా.లక్ష్మీసౌజన్య, నంద్యాల కార్యదర్శి డా.ఫనిల్‌కుమార్, డా.మధుసూదన్‌రెడ్డి, డా.అనిల్‌కుమార్ ఉన్నారు.

నేను ఎవరనుకున్నావు?



మంత్రి కొల్లు రవీంద్ర అనుచరుడిని...
నా వైన్ షాపు దగ్గరకు వస్తావా?.. జాగ్రత్త!
పోలీసు, ఎక్సైజ్ పోలీసులకు బెదిరింపులు

కోడుమూరు, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): అధికారం మాది... మంత్రి కొల్లు రవీంద్ర అనుచరుడిని... నా వైన్ షాపుకు దగ్గరకు వస్తే సహించేది లేదు. ఇక్కడేం జరిగినా పట్టించుకోకూడదు.. లేదంటే శ్రీకాకుళానికి బదిలీ చేయిస్తా... పోలీసులను కోడుమూరులో ఓ వ్యక్తి ఇట్లా బెదిరిస్తున్నాడు. తమ పార్టీ అధికారంలో ఉందని ఆగడాలకు పోతున్నాడు. మంత్రి పేరు చెప్పి పోలీసులపై పెత్తనం చెలాయిస్తున్నాడు. అధికారం ఉంటే ఎక్కడికైనా తెగబడతారు. ఏ మాటలైనా మాట్లాడుతారు. కోడుమూరులో ఓ వైన్ షాప్ యజమాని మంత్రి కొల్లు రవీంద్ర పేరు చెప్పుకొని చెలరేగిపోతున్నాడు. తన వైన్‌షాపు సమీపంలో ఏం జరిగినా... చూసీచూడనట్లు వెళ్లాలే గాని చర్యలు తీసుకోడానికి లేదని పోలీసులను, ఎక్సైజ్ అధికారులతో అంటున్నాడు. మంత్రి అనుచరుడినని చెప్పడంతో పోలీసులు, ఎక్సైజ్ పోలీసులు ఈయన ఆగడాలకు అడ్డుకట్ట వేయలేకపోతున్నారు. ఆయన చేస్తున్న హంగామాకు తల పట్టుకొంటున్నారు.

బార్‌ను తలపిస్తున్న వైన్ షాపు

మంత్రి అనుచరుడి వైన్ షాపు బార్‌ను తలపిస్తున్నది. ఆయన వైన్ షాపు వెనక మద్యం బాబులకు కుర్చొని తాగడానికి అన్ని సౌకర్యాలు కల్పించాడు. ప్రభుత్వం వైన్ షాపులకు ఎలాంటి పర్మిట్ రూంలు ఇవ్వలేదు. అయినప్పటికీ తాను మంత్రి అనుచరుడి అంటూ బార్‌ను తలపించేలా మద్యం ప్రియులకు తాగడానికి ఆశ్రయం కల్పిస్తున్నాడు.

మంత్రి అనుచరుడేనా.. మేమూ రూంలు ఏర్పాటు చేస్తాం..

పరిమిట్ రూంలు మంత్రి అనుచరుడికేనా... మేమూ ఏర్పాటు చేసుకుంటామని మిగిలిన వైన్ షాపు లైసెన్సుదారులు తెగబడ్డారు. దీంతో మద్యం బాబులు రూం లోపల, బయట, రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ మద్యం సేవిస్తున్నారు. పోలీసులు, ఎక్సైజ్ పోలీసులు చూసీ చూడనట్లు వ్యవహరించడం పట్ల ప్రజలు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

కన్నెత్తి చూడని పోలీసులు

మంత్రి అనుచరుడి వైన్ షాపు చుట్టు పక్కల మద్యం ప్రియులు ఎక్కడ పడితే అక్కడ బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించినా పోలీసులు అటు వైపు కన్నెత్తి చూడటం లేదు. ఇటీవల కాలంలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న వాళ్లను పోలీసులు స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఈ విషయంలో తెలుసుకొన్న షాపు యజమాని హుటాహుటిన మంత్రి దగ్గర ఉన్న ఒక అధికారి నుంచి పోలీసులపై ఒత్తిడి తీసుకొచ్చారు. దీంతో పోలీసులు మద్యం బాబులను వదిలేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.

చిల్లర కొట్టు వాళ్లపై వేధింపులు

వైన్ షాపు సమీపంలో కొంత మంది చిల్లరకొట్లు పెట్టుకొని వాటర్, గ్లాసులు, బీడీలు, సిగరెట్లు, తినుబండారులు పెట్టుకొని వ్యాపారం చేసుకుంటున్నారు. వాళ్లపై మంత్రి అనుచరుడు పెత్తనం సాగిస్తున్నాడు. తనకు నెలకు రూ.10వేల చొప్పున మామూళ్లు చెల్లించాలని లేకపోతే కేసులు నమోదు చేయిస్తానని బెదిరించాడు. ఇందుకు నిరాకరించిన వాళ్లపై కేసులు నమోదు చేయాలని ఎక్సైజ్ పోలీసులపై ఒత్తిడి తీసుకొచ్చారు. అంతేకాకుండా బంకులకు కరెంటు కట్ చేయించాడు. మంత్రి అనుచరుడికి మామూళ్లు ఇవ్వలేక కొంత మంది జీవనోపాధి కోల్పోయారు.

కేసులు నమోదు చేస్తాం

ప్రభుత్వం పర్మిట్ రూంలను కేటాయించలేదు. మద్యం ప్రియులకు తాగడానికి ఆశ్రయం కల్పిస్తే రూం యజమానులపై కేసులు నమోదు చేస్తాం.

- మంజుల, ఎక్సైజ్ సీఐ, కోడుమూరు

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం నేరం

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కేసులు నమోదు చేస్తాం. అలాగే తాగి వాహనం నడపడం కూడా నేరమే. అలాంటి వాళ్లపై కూడా డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేస్తాం.

- ఏపీ శ్రీనివాసులు, ఎస్ఐ, కోడుమూరు



గాయడప్డ షేక్షావలి, బాలిక వీపుపై గాట్లు

పిచ్చి కుక్క స్వైరవిహారం

- కాల్వలో నలుగురిపై, పత్తికొండలో బాలికపై దాడి..

ఓర్వకల్లు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాల్వ గ్రామంలో సోమవారం పిచ్చికుక్క స్వైర విహారం చేసింది. నలుగురిపై దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. షేక్షావలి, హనీఫాతోపాటు మరో ఇద్దరు చిన్నారులను కరవడంతో కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

బాలికపై వీధి కుక్కల దాడి

పత్తికొండ: పట్టణంలోని తేరుబజార్ ప్రాంతంలో ముబినా అనే ఏడేళ్ల బాలికపై వీధి కుక్కలు దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. అటుగా వెళ్తున్న స్థానికులు కుక్కలను తరమడంతో గాయాలతో బాలిక బయటపడింది. బాలిక 1వ తరగతి చదువుతోంది. మధ్యాహ్నం సమయంలో ఇంటి నుంచి వెళ్తుండగా బ్రహ్మయ్యస్వామి దేవాలయం వెనుక ప్రాంతంలో నాలుగు వీధి కుక్కలు ముబినాపై దాడి చేశాయి. ముబినా గట్టిగా కేకలు వేయడంతో సమీపంలో ఉన్న స్థానికులు కుక్కలను తరిమి బాలికను కాపాడారు. గాయపడ్డ బాలికను పత్తికొండ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స అందించారు.

మెరుగైన జీవన ప్రమాణాలు అందించాలి

- రిటైర్డు ఐఏఎస్ అధికారి లక్ష్మీకాంతం

నంద్యాల కల్చరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు పెంపొందించడమే సుపరిపాలన వారోత్సవాల ముఖ్య ఉద్దేశమని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి లక్ష్మీకాంతం అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్లో సుపరిపాలన వారోత్సవాలపై వర్క్ షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా రిటైర్డు ఐఏఎస్ అధికారి లక్ష్మీకాంతం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం డిసెంబరు 25న మాజీ ప్రధాని అటల్ బిహారి వాజ్‌పేయి జన్మదినాన్ని పురస్కరించుకొని దేశవ్యాప్తంగా సుపరిపాలన వారోత్సవాలు నిర్వహిస్తోందన్నారు. ఏ ప్రభుత్వమైనా ప్రజలకు జవాబుదారితనంతో, అత్యంత పారదర్శకంగా ఉండాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలు, ఉత్తర్వులు చిత్తశుద్ధితో అమలు చేయడంతోపాటు ప్రజల దగ్గరికి చేరే విధంగా అధికారులు కృషి చేయాలన్నారు. కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ అధికారులు, ప్రజలు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో కలిసి పనిచేస్తే అభివృద్ధి పథంలో నడిపించగలమన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, డీఆర్వో రామునాయక్, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రోడ్డును ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోండి

- ఎమ్మెల్యే పార్థసారథి



రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి

ఆదోని, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మహాత్మాగాంధీ నగర్‌లో సీసీ రోడ్డును ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పార్థసారథి పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం ఆంధ్రజ్యోతిలో అక్రమంగా గోడలు కట్టేశారు అన్న కథనానికి ఎమ్మెల్యే పార్థసారథి మున్సిపాల్ టౌన్ ప్లానింగ్ అధికారి బాల మద్దయ్య, డీఎస్పీ సోమన్న స్పందించారు. ధ్వంసం చేసిన రహదారిని పరిశీలించారు. మహాత్మాగాంధీ నగర్ కాలనీవాసులు ఎమ్మెల్యే పార్థసారథికి గోడును వెళ్లబోసుకున్నారు. పేదోళ్లు బతకరాదా... స్లం ఏరియా వాళ్ళు తిరుగుతున్నారు అన్న నెపంతో అక్రమంగా గోడ కట్టడమే కాకుండా, రోడ్డును ధ్వంసం చేసిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని వేడుకున్నారు. ఎమ్మెల్యే స్పందించి ప్రభుత్వ సొమ్ము రూ.16లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని, క్రిమినల్ కేసులు కూడా నమోదు చేస్తామని హెచ్చరించారు. ఉన్న గోడను తొలగించి రాకపోకలకు అంతరాయం లేకుండా చూడాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ధ్వంసం చేసిన రోడ్డుకు సంబంధించిన అమౌంటును కూడా రాబట్టి సీసీ రోడ్డును నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట మాజీ కౌన్సిలర్ భీమన్న, నాగరాజు గౌడ్, ఉపేంద్ర ఉన్నారు.

రైతులకు నష్టం చేయొద్దు

- కర్నూలు మార్కెట్ కమిటీ సెక్రటరీ జయలక్ష్మి



తనిఖీ చేస్తున్న సెక్రటరీ, సూపర్‌వైజర్లు

కర్నూలు అగ్రికల్చర్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కష్టాల్లో ఉన్న రైతుల్ని చేతనైనంత ఆదుకుందామని, ఎవరైనా కమిషన్ ఏజెంట్లు, వ్యాపారులు నష్టం చేయాలని చూస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కర్నూలు మార్కెట్ కమిటీ సెక్రటరీ జయలక్ష్మి హెచ్చరించారు. సోమవారం కర్నూలు మార్కెట్ యార్డులో టెండర్ ఆఫీసుతో పాటు యార్డులో రైతులు, వ్యాపారులు కమీషన్ ఏజెంట్లతో మాట్లాడారు. రైతులు తెచ్చిన పంట ఉత్పత్తులను ఎలక్ట్రానిక్ కాటాలో తూకం వేయించి అక్రమాలు ఏమైనా చోటు చేసుకుంటున్నాయేమోనని పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. నష్టం జరిగిందని అనిపిస్తే వెంటనే తమ కార్యాలయంలో వచ్చి ఫిర్యాదు చేయాలని, ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదని అన్నారు. వ్యాపారస్థులు, కమీషన్ ఏజెంట్లతో లైసెన్సు తీసుకున్న వారంతా తప్పనిసరిగా టెండర్‌లో పాల్గొనాలని, ఎవరైనా గైర్హాజరైతే చర్యలు లైసెన్సులు రద్దు చేస్తామని స్పష్టం చేశారు. అసిస్టెంట్ సెక్రటరీ వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్లు కేశవరెడ్డి, శివన్న, నాగేష్, అకౌంటెంట్ కిషన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు న్యాయం చేస్తాం

- ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా



అర్జీలు స్వీకరిస్తున్న ఎస్పీ

నంద్యాల క్రైం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టం) కార్యక్రమంలో అందిన సమస్యలపై విచారణ జరిపి చట్టపరిధిలో న్యాయం చేస్తామని ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 80 మంది నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. చట్టపరంగా ఉన్న సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపాలని, ఫిర్యాదులను పునరావృతం కాకుండా చూడాలని, నిర్ణీత గడువులోగా ఫిర్యాదులను పరిష్కరించాలన్నారు. ఫిర్యాదుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని పేర్కొన్నారు. ఉమ్మడి ఆస్తి తన వద్ద ఉంచుకొని భాగ పరిష్కారం చేయకుండా తన రెండో తమ్ముడు రామ్మోహన్‌రావు బెదిరిస్తున్నాడని విచారణ జరిపి న్యాయం చేయాలని డోన్ పట్టణానికి చెందిన రామచంద్రరావు అనే వ్యక్తి ఎస్పీతో మొరపెట్టుకున్నాడు. కొత్తపల్లి గ్రామానికి చెందిన లోకేష్ అనే వ్యక్తితో తనకు తల్లిదండ్రులు వివాహం జరిపించారని, పెళ్లి సమయంలో రూ.3లక్షల నగదు, 10తులాల బంగారం ఇచ్చారని, తిరిగి భర్త, అత్తింటివారు అదనపు కట్నం కోసం వేధిస్తూ ఇంటినుంచి గెంటివేశారని గోస్పాడు మండలానికి చెందిన తులసి అనే మహిళ ఎస్పీని ఆశ్రయించారు. తాను ప్రస్తుతం పుట్టింట్లో ఉంటున్నానని, తన భర్తకు మరొక మహిళతో వివాహం చేస్తామని అత్తింటివారు బెదిరిస్తున్నారని, న్యాయం చేయాలని తులసి ఎస్పీని వేడుకున్నారు.

సెలవులో కర్నూలు సబ్ రిజిస్ట్రార్లు!

- వెలవెలబోతున్న కర్నూలు కార్యాలయం
- రిజిస్ట్రేషన్లు జరగక ప్రజల అవస్థలు



వెలవెలబోతున్న కర్నూలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

కల్లూరు, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): కర్నూలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం అధికారులు లేక వెలవెలబోతోంది. ఇటీవల జరిగిన బదిలీల్లో ఆ శాఖ ఉన్నతాధికారులు కర్నూలు జిల్లా రిజిస్ట్రార్‌తోపాటు కర్నూలు, కల్లూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు అనుభవజ్ఞులైన అధికారులను నియమించడంలో విఫలమయ్యారని ప్రజలు విమర్శిస్తున్నారు. అసలే ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్లు అపై సెలవులో వెళ్తుండటంతో ప్రజలు రిజిస్ట్రేషన్లు జరగక అవస్థలు పడుతున్నారు. గత 12 రోజుల నుంచి కర్నూలు ఇన్‌చార్జి సబ్



కర్నూలు సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

రిజిస్ట్రార్ సెలవులో వెళ్లారని, ఆయన స్థానంలో రోజుకొకరికి ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌గా కొనసాగుతున్నారని క్రయ, విక్రయదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం కర్నూలు సబ్ రిజిస్ట్రారు కార్యాలయానికి రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన ప్రజలు అధికారులు లేక వెనుదిరిగిపోయారు. రిజిస్ట్రేషన్ల కోసం సదూర ప్రాంతాల నుంచి వస్తే ఒక్క అధికారి లేకపోవడం ఏంటని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ వరప్రసాద్ కోర్టు పనిపై విజయవాడకు వెళ్లగా మరో సీనియర్ అసిస్టెంట్ భవానీశంకర్ సెలవులో ఉండగా, కర్నూలు సబ్ రిజిస్ట్రార్‌గా ఉన్న ట్రైనీ డీఆర్ కూడా విధులకు హాజరు కాకపో వడంతో ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఈవిషయంపై జిల్లా ఇన్‌చార్జి డీఆర్‌కు ఫిర్యాదు చేయడానికి వెళ్లగా అందుబాటులో లేరని ప్రజలు ఆరోపించారు. స్టాంప్స్ రిజిస్ట్రేషన్ శాఖ ఉన్నతాధికారులు కర్నూలు, కల్లూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు రెగ్యులర్ ఎస్‌ఆర్‌లను నియమించాలని కోరుతున్నారు.

ఎమ్మిగనూరు ఎంఈవోపై చర్యలు తీసుకోవాలి

కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): విద్యార్థినిపై చేయి చేసుకున్న ఎమ్మిగనూరు ఎంఈవోపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో విద్యార్థిని తల్లిదండ్రులు, ఎస్ఎఫ్ఐ నాయకులు జాయింట్ కలెక్టర్‌కు బి.నవ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మిగనూరు మండలం పర్లపల్లె గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థినిపై ఎంఈవో-2 మధుసూదన్‌రాజు, డిసెంబరు 11వ తేదీన చేయి చేసుకున్నాడని అన్నారు. అయనపై ఈ నెల 16న డిప్యూటీ డీఈవో వెంకటరమణారెడ్డికి ఫిర్యాదు చేశామన్నారు. డిప్యూటీ డీఈవో విచారణ చేసి ఆరు రోజులవుతున్నా కూడా ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా, అమర్, సాయి ఉదయ్, ఆర్యన్ పాల్గొన్నారు.

ప్రతిభ ఆధారంగా రేషన్ షాపులను కేటాయించాలి: రేషన్ డీలర్ల ఎంపికలో రాజకీయ జోక్యం లేకుండా ప్రతిభ ఆధారంగా రేషన్ షాపులను కేటాయించాలని సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాఘవేంద్ర, నగేష్‌లు జాయింట్ కలెక్టర్ నవ్యకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి



జేసీకి వినతిపత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రభుత్వం ఖాళీగా ఉన్న 118 రేషన్ షాపులతోపాటు కొత్తగా 83 షాపులను ఏర్పాటు చేసి నోటిఫికేషన్ ఇవ్వడం జిల్లాలోని నిరుద్యోగులకు తీపి కబురు అందిందన్నారు. రేషన్ డీలర్ల ఎంపికలో ప్రభుత్వం నిర్వహిస్తున్న రాత పరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగా రేషన్ షాపులను కేటాయించాలని కోరారు.

అమిత్‌షాను పదవి నుంచి తొలగించాలి



కలెక్టరేట్ ముందు నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కేంద్ర హోం మంత్రి అమిత్ షాను పదవి నుంచి తొలగించాలని కాంగ్రెస్ కర్నూలు నగర అధ్యక్షుడు షేక్ జిలానీ బాషా డిమాండ్ చేశారు. అఖిల భారత కాంగ్రెస్ కమిటీ పిలుపు మేరకు సోమవారం అంబేడ్కర్ సమ్మాన్ మార్చ్ కార్యక్రమంలో భాగంగా స్థానిక రాజ్‌విహార్ సెంటర్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీగా బయలుదేరి అనంతరం కలెక్టర్ కార్యాలయం ముందు గాంధీ విగ్రహం ముందు నిరసన తెలియజేశారు. అనంతరం షేక్ జిలానీ బాషా మాట్లాడుతూ రాజ్యసభలో అమిత్‌షా భారతరత్న అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు. కార్యక్రమంలో ఎమ్మిగనూరు నియోజకవర్గ సమన్వయకర్త ఎం.కాశీం వలి, పీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి దామోదరం రాధాకృష్ణ, బజారన్న, జిలానీ, అనంతరత్నం మాదిగ పాల్గొన్నారు.

కర్నూలు న్యూసిటీ: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను వెంటనే బర్తరఫ్ చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ అంజిబాబు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సుందరయ్య సర్కిల్ జంక్షన్ వద్ద సీఐటీయూ న్యూసిటీ కమిటీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు అంజిబాబు, సీహెచ్ సాయిబాబా, సీఐటీయూ నాయకులు టి.రాముడు, చిన్న వ్యాపారుల సంఘం కార్యదర్శి ఎస్ఎండీ రఫీ, విజయ్, ప్రసాద్, శ్రీను, అశోక్, చాంద్ బాషా, హుశేన్‌బాషా, సుధాకరప్ప, జి.యేసు, కర్ణ, చిన్న మద్దిలేటి, శేఖర్, చెన్నయ్య, కృష్ణ, బతుకన్న తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

కర్నూలు న్యూసిటీ డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): కర్నూలు నగరంలో ఈనెల 30, 31 తేదీల్లో నిర్వహించే అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) 16వ మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాసులు పిలుపునిచ్చారు. సోమవారం నగరంలోని ఏఐవైఎఫ్ నగర సమితి ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కె.శ్రీనివాసులు మాట్లాడుతూ ఏళ్లు గడుస్తున్నా ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇవ్వకపోవడంతో చాలా మంది నిరుద్యోగులు వయోపరిమితి దాటి శాశ్వత నిరుద్యోగులుగా మారుతున్నారని అన్నారు. కూటమి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 2.70 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, వాటిని వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. డీఎస్సీ నోటిఫికేషన్ వెంటనే విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో నాగరాజు, బీసన్న, సోమన్న, చంటి, కుమారుర నాగేశ్వరుడు, మహేష్, చంద్రశేఖర్, రాజేశ్వరి, సౌమ్య పాల్గొన్నారు.

పతకాలు తీసుకురావాలి

కర్నూలు స్పోర్ట్స్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు కష్టపడి క్లస్టర్ యూనివర్సిటీకి పతకాలు తీసుకురావాలని ఏపీ ఆచార్య డీవీఆర్ సాయి గోపాల్ అన్నారు. సోమవారం జాతీయ స్థాకి క్రీడా పోటీలకు వెళ్లే క్లస్టర్ యూనివర్సిటీ క్రీడాకారులను వీసీ పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు పోటీ తత్వంతో ముం దుకు సాగాలన్నారు. అనంతరం క్లస్టర్ యూనివర్సిటీ డిగ్రీ కళాశాల ఫర్‌మెన్ ప్రిన్సిపల్ డా.ఇందిరా శాంతి, డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు వర్సిటీ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ శ్రీనివాసరెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ ఇన్‌చార్జి కే.విష్ణువందన, ఫిజికల్ డైరెక్టర్లు వై.ఫక్కీరయ్య, పి.మౌనిక పాల్గొన్నారు.

రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

కర్నూలు క్రైం, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): కర్నూలు నగర శివారులో దూపాడు రైల్వేస్టేషన్ సమీపంలో రైలు కింద పడి గుర్తు వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో ఎస్ఐ కిరణ్ బాబు పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతుడి వయస్సు 65 ఏళ్లు ఉంటుందని భావిస్తున్నారు. మృతుడి శరీరంపై బ్రౌన్ రంగు కలిగిన టీషర్టు, నీలం రంగు జీన్స్ ప్యాంటు ఉన్నాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు 9440627654 నెంబరును సంప్రదించాలని ఎస్ఐ తెలిపారు.

ఫ్యాన్సీ నెంబర్ ప్లేట్లపై స్పెషల్ డ్రైవ్

కర్నూలు క్రైం, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): నగరంలో నెంబరు ప్లేట్లు లేకుండా తిరుగుతున్న ద్విచక్ర వాహనాలు, ఫ్యాన్సీ నెంబర్లు కలిగిన ద్విచక్ర వాహనాలపై ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. సీఐ మన్సూరుద్దీన్ ఆధ్వర్యంలో సీ.క్యాంపు, బళ్లారి చౌరస్తా సమీపాల్లో తనిఖీలు చేశారు. నిబంధనల మేరకు నెంబర్లు ప్లేట్లు లేని 120 ద్విచక్ర వాహనదారులను అదుపులోకి తీసుకున్నారు. వీరందరికీ వెంటనే సరైన నెంబరు ప్లేట్లు బిగించుకోవాలని ఆదేశించారు.

ఘనంగా గణిత దినోత్సవం

కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): గుత్తిరోడ్డులోని శ్రీచైతన్య పాఠశాలలో గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీచైతన్య పాఠశాల ఆర్ఐ రామాంజనే యులు, ప్రిన్సిపాల్ పి.మాధవిలు మాట్లాడుతూ మారుతున్న కాలంలో నేటి తరం యువతకే కాకుండా యావత్ ప్రపంచానికి గణిత శాస్త్ర పితామహుడు శ్రీనివాసరామానుజన్ జీవితం ఒక ఆదర్శమన్నారు. అనంతరం శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి అధ్యాపకులు నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు గణిత శాస్త్రానికి సంబంధించిన పలు ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల డీన్ మల్లికార్జున, అధ్యాపకులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి

గూడూరు, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని హౌసింగ్ డీఈ వాసుదేవరావు అన్నారు. సోమవారం గూడూరులో పర్యటించిన హౌసింగ్ డీఈ వాసుదేవ రావు గృహ నిర్మాణా లకు సంబంధించి ఆర్ ఎల్, ఆర్‌సీలను పరిశీలించారు. ఆయన వెంట హౌసింగ్ ఏఈ జమన్న, వర్క్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్ రావు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించండి: టీడీపీ

ఓర్వకల్లు, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): నన్నూరులో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సోమవారం ఎంపీడీవో శ్రీనివాసులుకు టీడీపీ నాయకులు విజయుడు, షంషుద్దీన్, మోహన్ వినతిపత్రం సమర్పించారు. గ్రామంలో సచివాలయం-2 నిర్మించాలని, అక్కడక్కడ కరెంటు స్తంభాలు శిథిలావస్థకు చేరాయని, కొత్తవి నిర్మించాలని కోరారు అలాగే సామూహిక మరుగుదొడ్లకు మరమ్మతులు చేయాలని, ఎస్సీ కాలనీలో సిమెంటు రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేయాలని, తడకనపల్లెకు వెళ్లే రస్తాలోని హెల్త్ సెంటర్‌కు మరమ్మతులు చేయాలని కోరారు.



ఎంపీడీవోకు వినతి పత్రం ఇస్తున్న టీడీపీ నాయకులు

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

టీటీడీ బోర్డు సభ్యుడు మల్లెల రాజశేఖర్



మాట్లాడుతున్న మల్లెల రాజశేఖర్

ఓర్వకల్లు, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నెలకొన్న భూ సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తోందని టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, టీటీడీ బోర్డు సభ్యుడు మల్లెల రాజశేఖర్ అన్నారు. సోమవారం మండలంలోని హుశేనాపురం గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు తహసీల్దార్ విద్యాసాగర్ అధ్యక్షత వహించగా.. ముఖ్యఅతిథిగా మల్లెల రాజశేఖర్ హాజరై మాట్లాడారు. గ్రామాల్లో రీసర్వే పేరుతో భూముల కొలతలు తారుమారు కావడం, ఆన్‌లైన్‌లో భూముల అవకతవకలు నమోదు కావడం వంటి సమస్యలు ఉన్నాయన్నారు. ఈ సదస్సులో అర్జీలు సమర్పిస్తే సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ చంద్రగోవర్ధనమ్మ, ఎంపీటీసీ చిన్నమ్మ, కాల్వబుగ్గ మాజీ చైర్మన్లు చంద్రపెద్దస్వామి, సుధాకర్, ఈవో మద్దిలేటి, నాయకులు మహబూబ్ బాషా, కేవీ మధు, జయకృష్ణ, శేఖరప్ప, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గూడూరు: రెవెన్యూ సదస్సులతో రైతుల భూ సమస్యలు పరిష్కారం అవుతాయని తహసీల్దార్ రామాంజనేయులు అన్నారు. సోమవారం గూడూరులోని వెలుగు కార్యాయలంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతుల నుంచి భూ సమస్యలకు సంబంధించి 31 అర్జీలను స్వీకరించారు. ఈసమావేశంలో నగర పంచాయతీ చైర్మన్ జె వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్లు పీఎస్ అస్లాం, లక్ష్మన్న, డిప్యూటీ తహసీల్దార్ ధనుంజయ రెడ్డి, ఆర్ఐ వరలక్ష్మీ, వీఆర్‌వో మధు కృష్ణ, రైతులు పాల్గొన్నారు.

చైన్ స్నాచింగ్ కేసులో నిందితుడి అరెస్టు

కర్నూలు క్రైం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో సి.క్యాంపులో జరిగిన చైన్ స్నాచింగ్ కేసులో నిందితుడు వెంకటేశ్వర్లును పోలీసులు అరెస్టు చేశారు. పెంచలమ్మ అనే మహిళ 21వ తేదీ సాయంత్రం 7 గంటల ప్రాంతంలో సీ.క్యాంపు ప్రభుత్వ పాఠశాల సమీపంలో నడుచుకుంటూ వెళ్తుండగా.. జూపాడుబంగ్లా కాపానగర్‌కు చెందిన వెంకటేశ్వర్లు ఆమెను వెంబడించి మెడలోని గొలుసును తెంపుకుని ఉడాయించాడు. సమాచారం స్థానికులు ఇవ్వడంతో సీఐ శేషయ్య, ఎస్ఐ మన్మథ విజయ్‌లు హుటాహుటిన అక్కడకు చేరుకుని నిందితుని కోసం గాలించారు. స్థానికుల సాయంతో నిందితున్ని సోమ వారం అరెస్టు చేసి అతని వద్ద నుంచి 21 గ్రాముల బంగారు గొలుసును స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు పోలీసులు తెలిపారు.

మాంటిస్సోరి విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న విద్యా సంస్థల డైరెక్టర్ రాజశేఖర్

కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): సింగపూర్ మ్యాథ్స్ ఒలింపియాడ్‌లో మాంటిస్సోరి విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. విద్యార్థులను పరిశోధనల వైపు ప్రోత్సహించడానికి ప్రతి సంవత్సరం ఒలింపియాడ్ ఇంటర్నేషనల్ సంస్థ సింగపూర్ మ్యాథ్స్ చాలెంజ్‌ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఈ ఏడాది నిర్వహించిన పరీక్షలో ఎ.క్యాంపు మాంటిస్సోరి పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న జతిన్ అనే విద్యార్థి, 8వ తరగతి చదువుతున్న తౌశిక్‌లు ప్రతిభ కనబరిచి వచ్చే ఏడాది జూలైలో సింగపూర్‌లో జరగబోయే సింగపూర్ మ్యాథ్స్ గ్లోబల్- 2025కు ఎన్నికయ్యారు. ఈ పోటీల్లో ప్రపంచ వ్యాప్తంగా 43 దేశాలు పాల్గొంటాయి. ఎంపికైన విద్యార్థులను మాంటిస్సోరి విద్యాసంస్థల డైరెక్టర్ కే.రాజశేఖర్, ప్రధానోపాధ్యాయురాలు రమాజ్యోతి, కో-ఆర్డినేటర్ సుబ్బారెడ్డి అభినందించారు.

మానవ హక్కులను పరిరక్షించాలి



మాట్లాడుతున్న రిటైర్డు ఐఏఎస్ అధికారి లక్ష్మీకాంతం

కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): మానవ హక్కులను పరిరక్షించాలని రిటైర్డు ఐఏఎస్ అధికారి బీ.లక్ష్మీకాంతం అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో గుడ్ గవర్నెన్స వీక్ - గ్రామాల వైపు పరిపాలన ప్రశాసన్ గావోం కీ ఓర్ కి సంబంధించిన వర్క్‌షాపులో ముఖ్యఅతిథిగా పాల్గొని సుపరిపాలన అంశంపై ప్రసంగించారు. దేశానికి స్వరాజ్యం వచ్చిన తర్వాత నాకు కావాల్సింది సుపరిపాలన అని మహాత్మాగాంధీ అన్నారన్నారు. డిసెంబరు 19 నుంచి 24వ తేదీ వరకు వారం రోజుల పాటు సుపరిపాలన వారోత్సవాలను దేశంలోని 728కి పైగా జిల్లాల్లో జరుపుకుంటున్నామన్నారు. డీఆర్వో వెంకట నారాయణమ్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చిరంజీవి, జడ్పీ సీఈవో నాసరరెడ్డి పాల్గొన్నారు.

పెండింగ్ జీతాలు విడుదల చేయాలి

కర్నూలు న్యూసిటీ డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మెప్మా ఆర్పీల ఆరు నెలల పెండింగ్ జీతాలు వెంటనే విడుదల చేయాలని కలెక్టరేట్ ఎదుట మెప్మా ఆర్పీ ఉద్యోగుల సంఘం, సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా చేశారు. ఆ సంఘం నగర అధ్యక్షురాలు పి.రుద్రమ్మ అధ్యక్షతన జరిగిన ధర్నాలో జిల్లా కార్యదర్శి ఎస్.ఉమాదేవి, నగర అధ్యక్షురాలు ఎస్.షభానా పాల్గొని మాట్లాడారు. హెచ్ఆర్ పాలసీ అమలు, గ్రేడింగ్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. అనంతరం ప్రజా సమ స్యల పరిష్కార వేదికలో సీఐటీయూ సంఘం, మెప్మా ఆర్పీల ఉద్యోగులు జాయింట్ కలెక్టర్ నవ్యకు వినతిపత్రం సమర్పించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి అంజిబాబు, శ్రామిక మహిళా జిల్లా కార్యదర్శి పి.నిర్మల, నగర కార్యదర్శి సీహెచ్ సాయిబాబా, నాయకులు వెంకటేశ్వర్లు, అరుణ, స్వాతి, జ్యోతి, మెప్మా ఆర్పీ ఉద్యోగుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఒకేషనల్ కోర్సులపై అవగాహన

కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): కర్నూలు బి.క్యాంపు ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో జైభీమ్ దళిత వికాస్ సంఘం ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు కేరీర్ గైడెన్స్, ఒకేషనల్ కోర్సులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి సబ్ ట్రెజరీ ఆఫీసర్ శ్రీనివాసులు, ప్రిన్సిపాల్ నాగస్వామి నాయక్‌లు హాజరై మాట్లాడుతూ విద్యార్థులు ప్రణాళికబద్ధంగా క్రమశిక్షణతో చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలన్నారు. అనంతరం వారు పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో గణిత ఉపాధ్యాయులు శేషన్న, ఆల్‌ఫ్రెడ్, వెటర్నరి డాక్టర్ బాలకృష్ణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నాటుసారా నిర్మూలనకు సహకరించాలి

కర్నూలు అర్బన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): నాటుసారాను నిర్మూలనకు సహకరించాలని ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుధీర్ బాబు అన్నారు. సోమవారం నగరంలోని బంగారుపేటలో గ్రామ సభ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటు సారా తయారీకి దూరంగా ఉన్నా వారికి ఉపాధి కల్పించే విధంగా చర్యలు తీసు కుంటామన్నారు. కార్యక్రమంలో సీఐలు చంద్రహాస్, ఎస్.నవీన్ బాబు, కే.వెంకటేశ్వర్లు, జి.మధు పాల్గొన్నారు.

గొప్ప రాజనీతిజ్ఞుడు పీవీ

కర్నూలు(అర్బన్), డిసెంబరు 23: సరళీకృత ఆర్థిక విధానాలతో దేశాన్ని ఆర్థిక సంక్షోభం నుంచి గట్టెక్కించిన రాజ నీతిజ్ఞుడు మాజీ ప్రధాని పీవీ నరసింహారావు అని కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు షేక్ జిలానీ బాషా అన్నారు. సోమవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పీవీ 20వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ సుధాకర్‌బాబు, కే వెంకటరెడ్డి, అనంతరత్నం మాదిగ, ఎన్‌సీ బజారన్న, షేక్ ఖాజా హుస్సేన్, లాజరస్, మల్లేశ్వరి, ప్రమీల, శ్రీలత పాల్గొన్నారు.

కర్నూలు కల్చరల్: దేశాభివృద్ధికి మాజీ ప్రధాని దివంగత పీవీ నరసింహారావు చేసిన సంస్కరణలు చిరస్మరణీయమని నగర బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు సండేల్ చంద్రశేఖర్ కొనియాడారు. సోమవారం పీవీ నరసింహారావు వర్ధంతి సందర్భంగా నగరంలోని కోట్ల సర్కిల్ వద్ద గల బ్రాహ్మణ సేవా సహకార సంఘం కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో సంఘం గౌరవా ధ్యక్షుడు చెరువు వెంకట దుర్గాప్రసాద్, ప్రధాన కార్యదర్శి చల్లా నాగరాజ శర్మ, ఉపాధ్యక్షుడు కంచుగంటల శ్యామసుందర్ రావు, ఉప కార్యదర్శి నాగులవరం రాజశేఖర్‌రావు, గౌరవ సలహాదారులు సముద్రాల శ్రీధర్ బాబు, టీవీ రవిచంద్ర శర్మ, ఉపాధ్యక్షులు సూరపు రాజు శ్రీనివాసరాజు, ఆకెళ్ల రాధాకృష్ణ పాల్గొన్నారు.





పీవీ నరసింహారావు చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్, బ్రాహ్మణ సంఘం నాయకులు

రాయపాటి శ్రీనివాస్‌కు డాక్టరేట్



కర్నూలు కల్చరల్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): కర్నూలుకు చెందిన లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్ ప్రతినిధి డాక్టర్ రాయపాటి శ్రీనివాస్‌కు బెత్లెహోమ్‌లోని అల్ బసామ్ యూనివర్సిటీ ఆఫ్ కల్చర్, ఆర్ట్స్ అండ్ సైన్సెస్ వారు గౌరవ డాక్టరేట్ అందజేశారు. సోమవారం పాలస్తీనాలో జరిగిన అంతర్జాలంలో జరిగిన సమావేశంలో గత 34 ఏళ్లుగా సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్న రాయపాటి శ్రీనివాస్‌కు సామాజిక సేవారంగంలో ఈ గౌరవ డాక్టరేట్‌ను ప్రకటించి, అంతర్జాలం ద్వారా అందజేశారు. బాసమ్ ఫోరమ్ ఫర్ కల్చర్ అండ్ ఆర్ట్స్ వ్యవ స్థాపకుడు, హెడ్ ఆఫ్‌ది బోర్డు ఆఫ్ డైరెక్టర్స్ డాక్టర్ బసామ్ జబ్బా, డాక్టర్ షాకిరత్ అల్ మహబీర్‌లు ఈ డాక్టరేట్‌ను అంతర్జాలంలో అందజేశారు. ఈ సందర్భంగా రాయపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ పురస్కారం సామాజిక సేవల్లో ముందుకు పోయేందుకు మరింత స్ఫూర్తినిచ్చిందన్నారు.

హాకీ విజేత మున్సిపల్, గార్గేయపురం జట్లు

కర్నూలు స్పోర్ట్స్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ పండుగ సందర్భంగా ఇవాంజెలికల్ సపోర్టింగ్ టీమ్, ఈఎస్‌టీ కర్నూలు ఆధ్వర్యం లో స్థానిక ఎస్టీబీసీ కళాశాల మైదానంలో నిర్వహించిన హాకీ పోటీల్లో విజేతలను సోమవారం ప్రకటించారు. బాలుర ఫైనల్ పోటీల్లో మున్సిపల్ హైస్కూల్‌జట్టు, గార్గేయపురం జడ్పీహెచ్ఎస్ జట్టుపై 1-0 తేడాతో గెలుపొందింది. అలాగే బాలికల విభాగంలో గార్గేయపురం జట్టు మున్సి పల్ హైస్కూల్ జట్టుపై 3-0 తేడాతో గెలుపొందింది. విజేతలకు జిల్లా హాకీ కార్యదర్శి దాసరి సుధీర్, వైస్ ప్రెసిడెంట్ ప్రవీణ్, ఈఎస్‌టీ చైర్మన్ జయాకర్, సెక్రటరీ భాను ట్రోఫీలను, మెడల్స్‌ను అందజేసి అభినం దించారు. కార్యక్రమంలో ఈఎస్‌టీ సభ్యులు జయపాల్, అరుణ్, రవికుమార్, రాజు పాల్గొన్నారు.

రోజుకు రెండు సార్లు బ్రష్ చేయాలి

కర్నూలు హస్పిటల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి రోజుకు రెండుసార్లు బ్రష్ చేయాలని దంత వైద్యులు సూచించారు. జాతీయ దంత వైద్యుల దినోత్సవం సందర్భంగా నగరంలోని శ్రీలక్ష్మి స్కూల్, బుధవారపేట అనాథ ఆశ్రమంలో రాయలసీమ డెంటల్ అసోసియేషన్ కర్నూలు శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత దంత వైద్యశిబిరం నిర్వహిం చారు. ఈ సందర్భంగా రాయలసీమ డెంటల్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి డా.రాయపు రామచంద్రారెడ్డి మాట్లాడుతూ నోటి దుర్వాసనతో బాధపడుతున్న వారు భోజనం అనంతరం మౌత్‌వాష్ చేయడంతో దుర్వాసన తగ్గుతుందన్నారు. రాయలసీమ బ్రాంచ్ సీడీఎం కన్వీనర్ డాక్టర్ నౌషద్, సీడీఈ కన్వీనర్ మజర్, పశుపతి, రాజశేఖర్ రెడ్డిలు దంత సమస్యలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు.

ఎన్టీఆర్ కళాపరిషత్ పోటీలకు

‘శ్రీకృష్ణ కమలపాలిక’ ఎంపిక

కర్నూలు కల్చరల్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): నగరంలోని టీజీవీ కళాక్షేత్రం కళాకారులు రూపొందించిన ‘శ్రీకృష్ణ కమలపాలిక’ పౌరాణిక పద్య నాటకం ఒంగోలులోని ఎన్టీయార్ కళాపరిషత్ సంస్థ నిర్వహిస్తున్న జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆ సంస్థ అధ్యక్షుడు ఈదర హరి బాబు ఒక ప్రకటనలో తెలిపారు. 2024 జనవరి 18 నుంచి 30 వరకు ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లోని కళాసంస్థలతో ఈ నాటక పోటీలు నిర్వహి స్తున్నట్లు ఆయన తెలిపారు. కాగా ఈ పోటీలకు టీజీవీ కళాక్షేత్రం కర్నూలు వారి పద్య నాటకం జనవరి 19న సాయంత్రం 7 గంటలకు ఒంగోలులో ప్రదర్శన ఉంటుందని ఆయన తెలిపారు. రాయలసీమ నుంచి ఎంపికైన ఏకైక పద్య నాటకం శ్రీకృష్ణకమలపాలిక ఒక్కటే కావడం విశేషమని నాటక దర్శకుడు పత్తి ఓబులయ్య తెలిపారు.

ప్రజల నుంచి 17 అర్జీలు



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కమిషనర్

కర్నూలు న్యూసిటీ డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నగర పాలక అదనపు కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ ఆధ్వర్యంలో ప్రజా ఫిర్యాదుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి 17 అర్జీలు వచ్చాయి. కార్యక్రమంలో మేనేజర్ చిన్న రాముడు, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కే.విశ్వేశ్వరరెడ్డి, ఆర్‌వో జునైద్, ఎంఈ సత్య నారాయణ, టీపీఆర్‌వో వెంకటలక్ష్మి, సూపరింటెండెంట్ రామక్రిష్ణ, బిల్డింగ్ సూపర్‌వైజర్ అంజాద్‌బాషా, టిడ్కో అధికారులు పెంచాలయ్య, మధు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక లాభాలు

సి.బెళగల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతో అధిక లాభాలు సాధించవచ్చు అని మండల వ్యవసాయ అధికారి మల్లేష్‌కు మార్ రైతులకు సూచించారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం అవరణలో ప్రకృతి వ్యవసాయంతో పండించిన కురగాయాలను, జామ పండ్లను రైతులు విక్రయించారు. ఏవో మల్లేష్ కుమార్ మాట్లాడుతూ వ్యవసాయ అధికారుల సూచన మేరకు రైతులు వెంకటేశ్వర్లు, నాగన్న ఆకుకూరలు, కురగాయలు సాగు చేయడంతో మం చి దిగుబడి వచ్చిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తిమ్మప్ప, ధనుంజయుడు, బాలాజీ వెంకటేష్, గౌస్ పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

కల్లూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): తొగాట వీర క్షత్రీయ సేవా సంఘం ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించారు. సోమవారం కల్లూరులోని చౌడేశ్వరి మాత ఆధ్వర్యంలో సంఘం అధ్యక్షుడు మాదం గంగాధర్, చైర్మన్ పోలిశెట్టి వెంకటేశ్వర్లు, డా.పోలిశెట్టి సతీష్ కుమార్ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం పోలిశెట్టి సతీష్ కుమార్, మాదం గంగాదర్ మాట్లాడుతూ అన్ని రంగాల్లో తొగాట క్షత్రీయులు రాణించాలన్నారు. సంఘం ప్రధాన కార్యదర్శి ఇస్తే క్రిష్ణయ్య, అక్కెం ఈశ్వరయ్య, మాదం రామచంద్రుడు, వర్రప సాదరావు, మహిళా సంఘం అధ్యక్షురాలు క్రిష్ణవేణి పాల్గొన్నారు.

ఉపసంహరించుకోవాలి

కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): జాతీయ వ్యవసాయ మార్కెట్ విధానాన్ని ఉపసంహరించుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకట నారాయణమ్మకు రైతు సంఘం నాయకులు వినతి పత్రం సమర్పించారు.

మహిళ అదృశ్యం



మహదేవమ్మ (ఫైల్)

ఆస్పరి, డిసెంబరు23 (ఆంధ్రజ్యోతి) : గ్రామానికి చెందిన బోయ మహదేవమ్మ అనే మహిళ అదృశ్యమైంది. పది రోజుల కిందట ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని భర్త లక్ష్మన్న పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మస్తాన్ వలి తెలిపారు.

కబడ్డీ పోటీలకు ఎంపిక





హారతి, నరసింహులు(ఫైల్)

ఆదోని అగ్రికల్చర్, డిసెంబరు23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కబడ్డీ పోటీలకు ఆదోని విద్యార్థులు ఎంపికైనట్లు అసోసియేషన్ సహాయ కార్యదర్శి అమర్ ప్రకాష్ తెలిపారు. కర్నూలులో నిర్వహించిన పోటీల్లో నరసింహులు, శ్రీరామ్‌నగర్‌కు చెందిన హారతి ప్రతిభ కనపరచరన్నారు.

టీడీపీ నాయకుడి మృతి



లాలు సాహెబ్ (ఫైల్)

క్రిష్ణగిరి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): బోయ బొంతిరాళ్ళ గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు లాలు సాహెబ్(82) సోమవారం మృతి చెందాడు తనయుడు తెలుగు యువత అధ్యక్షుడు మమమ్మద్ రఫీని ఎమ్మెల్యే శ్యాం బాబు పోన్‌లో పరామర్శించారు. కేఈ కుటం బానికి అనుచరుడిగా, పార్టీ అభివృద్ధికి కృషి చేశారని మాజీ జడ్పీటీసీ కేఈ జయన్న అన్నారు. మృతదేహానికి నివాళి అర్పించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ఆస్పరి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నహోతూరు గ్రామంలో కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ మస్తాన్ వలీ తెలిపారు. పెండేకంటి పద్మావతి అనే మహిళపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

దోబీల నియామకాలకు ఉత్తర్వులు

ఆదోని టౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రులు, పోలీస్ శాఖల్లో దోబీల నియామకానికి డిస్ట్రిక్ట్ బీసీ సర్వీస్‌కో ఆపరేటివ్ సొసైటీ (కర్నూల్) ఈడీ జాకిర్ హుస్సేన్ ఉత్తర్వులు జారీ చేసినట్లు రజక వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ సావిత్రి సోమవారం తెలిపారు. దోబీ పోస్టుల్లో రజకులకే అవకాశమివ్వాలని తాను కలెక్టర్‌ను కోరడంతో ఆయన ఆదేశాల మేరకు ఉత్తర్వులు జారీ చేయడంపై హర్షం వ్యక్తం చేశారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం



కూరగాయలను పరిశీలిస్తున్న తహసీల్దార్ రమాదేవి

తుగ్గలి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం ఉంటుందని, తక్కువ పెట్టుబడితో రైతులకు లాభమని తహసీల్దార్ రమాదేవి అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద రాంపల్లికి రైతులు రాముడు, బాబు, షేక్షావలి ఏర్పాటు చేసిన కూరగాయలను స్టాల్స్‌ను ఆమె పరిశీలించారు. ఏపీఎం రాధాకృష్ణ, వీఆర్వోలు నాగేంద్ర, వెంకట్రాముడు, కాశీ రంగస్వామి తదితరులు ఉన్నారు.

డీలర్ పోస్టుకు దరఖాస్తు చేసుకోండి

మద్దికెర, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బురుజుల గ్రామానికి చౌక దుకాణం (ఓసీ) మంజూరైందని, దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ హుశేన్‌సాహెబ్ సూచించారు. సోమవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. బురుజుల గ్రామ డీలర్ లక్ష్మీనారాయణ మృతి చెందడంతో నోటిఫికేషన్ విడుదల చేశామన్నారు. 31వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాని, ఇంటర్మీడియట్ చదివి ఉండాలని, 18 సంవత్సరాలు పైబడి 40ఏళ్లలోపు ఉండాలన్నారు. డీటీ శ్రీదేవి, ఆర్‌ఐ రవికుమార్ ఉన్నారు.

ఆలూరును అగ్రస్థానంలో నిలుపుతాం



సభ్యత్వ నమోదు చేయిస్తున్న వైకుంఠం జ్యోతి

ఆలూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వంలో ఆలూరును జిల్లాలోనే అగ్రస్థానంలో నిలుపుతామని టీడీపీ మహిళా నాయకురాలు వైకుంఠం జ్యోతి అన్నారు. సోమవారం సాయంత్రం పట్టణంలో టీడీపీ సభ్యత్వం నిర్వహించారు. సీఎం చంద్రబాబు కార్యకర్తల సంక్షేమానికి పెద్దపీట వేసేలా బృహత్తర కార్యక్రమానికి కార్యాచరణ చేశారన్నారు.

కుక్కలకు వ్యాక్సిన్

మద్దికెర, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక పశువైద్యశాలలో కుక్కలకు వ్యాక్సిన్ వేశారు. పశువైద్యాధికారి కృష్ణానాయక్ మాట్లాడుతూ వ్యాక్సిన్‌తో కుక్కల సంతతగి పెరగదన్నారు. రైతులు తమ పశువు లకు వ్యాధి సోకితే పశువైద్యశాలకు తీసుకురావాలన్నారు. పశుగ్రాసానికి రైతులు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

కాలువలు ఏర్పాటు చేయండి

వెల్దుర్తి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): స్థానిక విద్యానగర్‌లో మురుగు కాలువలు ఏర్పాటుచేయాలని ఈవోఆర్డీ రవికిశోర్‌కు కాలనీ వాసులు వినతి పత్రం అందజేశారు. నీరు నిల్వ ఉండటంతో దోమలు వృద్ధి చెందాయని కాలువలు ఏర్పాటుచేసి కర్నూలు రహదారి పక్కన ఉన్న కాలువకు అనుసంధానం చేయాలన్నారు.

అందరికీ ఉపాధి పనులు కల్పిస్తాం

మద్దికెర, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జాబ్‌కార్డు గల కూలీలందరికీ ఉపాధి పనులు కల్పిస్తామని ఏపీవో నర్సిరెడ్డి అన్నారు. సోమవారం బొజ్జనాయునిపేట ఎం.అగ్రహారం గ్రామాల్లో పనులను పరిశీలించారు. జాబ్‌కార్డు ఉన్నవారే పనులకు రావాలన్నారు. కూలీలు వలస వెళ్లవద్దని సూచించారు. మేటీలు కూలీల నుంచి డబ్బులు వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అర్జీలకు స్పందన

తుగ్గలి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రశాసన్ గావ్ కి ఔర్ స్పెషల్ క్యాంపులో అర్జీలు రావడంతో సోమవారం కార్యదర్శి మనోహర్, టీడీపీ నాయకులు వెంకట్రాముడు గౌడు, టీవీఆర్ వెంకట్రాముడు, గురుమూర్తి ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు చేపట్టారు. సుధాకర్ రెడ్డి, గణ మద్దిలేటి పాల్గొన్నారు.

తరగతి గది ఇలా.. పాఠాలు ఎలా?

- 420 మంది విద్యార్థులు.. 6 గదులు
- ఆదోని అమరావతి ప్రభుత్వ ఉన్నత పాఠశాల దుస్థితి



వరండాలో చదువుకుంటున్న విద్యార్థులు



అదనపు తరగతి గదులు ఇలా..

ఆదోని అగ్రికల్చర్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని అమరావతి ప్రభుత్వ ఉన్నత పాఠశాల మూడో తరగతి నుంచి పదో తరగతి వరకు బోస్తునానరు. 420 మంది విద్యార్థులుండగా, ఆరు తరగతి గదులు మాత్రమే ఉన్నాయి. ఆరో తరగతిలోనే 130 మంది విద్యార్థులు ఉన్నారు. హెచ్‌ఎం గది, స్టాఫ్ రూమ్‌తో పాటు భోజన సామగ్రి నిల్వ చేసేందుకు ఒక గదిని తీసుకున్నారు. 8 తరగతులకు గాను ఐదు గదులే ఉన్నాయి. అవి చాలకపోవ డంతో ఆరు బయట చెట్ల కింద, వరండాలో అలాగే పక్కనే అంగన్వాడీ కేంద్రంలో విద్యార్థులను కూర్చో బెడుతున్నారు.

అప్ గ్రేడ్ చేసి వదిలేశారు..

2023-24లో గత ప్రభుత్వం ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేశారు. శివారు కావడంతో ఇక్కడి నుంచి పట్టణానికి వెళ్లడానికి ఇబ్బంది తప్పిందని విద్యార్థులు, తల్లిదండ్రులు సంతోషపడ్డారు. పక్కనే బసాపురం, పర్వతాపురం, మార్కెట్ యార్డ్ సమీపంలోని విద్యార్థులు కూడా ఈ పాఠశాలలో చేరారు. అయితే అదనపు తరగతి గదులు, ఉపాధ్యాయులను లేక విద్యార్థులు ఇబ్బందులు గురవుతున్నారు.

నాడు-నేడు పునాదులకే పరిమితం..

వైసీపీ ప్రభుత్వం రెండేళ్ల కిందట నాడు-నేడు కింద పాఠశాలకు రెండు గదుల నిర్మాణానికి రూ.24 లక్షలు విడుదల చేస్తున్నట్లు పేర్కొంది. అయితే పునాదులతోనే పనులు గిపోయాయి.

త్వరలో పూర్తి చేస్తాం



నాడు-నేడు కింద రెండు అదనపు తరగతి గదుల నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. అయితే పనులు మధ్యలోనే ఆగిపోయాయి. జిల్లా ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. త్వరలో పూర్తి చేస్తాం. **-శ్రీనివాసులు, ఎంఈవో-2, ఆదోని**

రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి

మద్దికెర, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో శనగ, కంది పంటలు దెబ్బతినే ప్రమాదముందని, రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని ఏవో రవి సూచించారు. సోమవారం రైతుభరోసా కేంద్రంలో మాట్లాడుతూ వర్షంతో కంది పూత రాలుతోందని, కొన్ని గ్రామాల్లో శనగకు వేరుకుల్లు తెగులు సోకిందన్నారు. వ్యవసాయ అధికారుల సలహాలు సూచనలు పాటించాలని, అధిక మోతాదులో క్రిమిసంహారక మందులు పిచికారీ చేయొద్దన్నారు. బోజరాజు, జాకీర్, ఆనంద్ నాయక్, రైతులు ఉన్నారు.

వీఆర్వోల కమిటీ ఎన్నిక

పత్తికొండ, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండల వీఆర్వోల సంఘం నూతన కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా డి.రవికుమార్, ఉపాధ్యక్షుడిగా టి.శేషన్న, ప్రధాన కార్యదర్శిగా కె.బాషా, కోశాధికారిగా సాగర్‌రెడ్డి, సహాయ కార్యదర్శిగా కె.సుజాత, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ప్రభాకర్‌ను సభ్యులు ఎన్నుకున్నారు.

ప్రజా సమస్యలను వేగంగా పరిష్కరించండి

- సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్



వినతులను స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ఆదోని, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కార్యాలయంఓ పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రసెల్ సిస్టం-పీజీఆర్ఎస్‌లో అర్జీలను స్వీకరించారు. మండలంలోని అన్ని శాఖల అధికారులకు సంబంధించిన సమస్యలను తెలియజేస్తూ గడువులోపు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బియాండ్ ఎస్ఎల్ఏలోకి వెళ్లకుండా చూడాలన్నారు.

1.హొళగుంద మండలం పెద్ద గోనేహాల్ గ్రామానికి చెందిన ప్రేమ వర్ధన్ రెడ్డి నకు సర్వే నంబరు 285లో 4.56ఎకరాలు పెద్దల నుంచి సంక్రమించిందని, ఆన్‌లైన్‌లో దేవదాయ శాఖ భూమిగా ఉందని విచారణ చేసి, నమోదు చేయవలసినదిగా అర్జీ సమర్పించుకున్నారు.

2. తన రేషన్ కార్డులో గుర్తు తెలియని వ్యక్తి పోటో వచ్చిందని, తన ఫొటో అప్‌లోడ్ చేయాలని ఆదోని పట్టణం ఎస్‌కేడీ కాలనీకి చెందిన పంపారెడ్డి అర్జీ ఇచ్చారు.

3. ఎమ్మిగనూరు మండలం టీఎస్ కూలూరు గ్రామానికి చెందిన వీఆర్ఏ టి.సుశీలమ్మ అనారోగ్యం కారణంగా కుమారుడు మల్లికార్జున నామిని వీఆర్ఏగా పనిచేస్తున్నా డని, గత వారం ప్రైవేట్ సర్వేయర్ దాడి చేశడని చర్యలు తీసుకోవాలని గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం జిల్లా అధ్యక్షుడు యన్ చిన్నస్వామి, గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం సభ్యులు అర్జీ సమర్పించుకున్నారు.

4. కల్లుభావికి చెందిన కె.మహాదేవి తనకు ప్రభుత్వం ఇంటి పట్టా మంజూరు చేసిందని, సర్వే చేసి సరిహద్దులు చూపాలని అర్జీ సమర్పించుకున్నారు.

ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్స్ శ్రీనివాసరాజు, వేణు సూర్య, డీఎల్పీవో నూర్జహాన్, గృహ నిర్మాణ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రవి కుమార్, ఆర్‌అండ్‌బీ డిప్యూటి ఇంజనీర్ వెంకటేశ్వర్లు, డ్వామా ఏపీడీ లోకేశ్వర, ఆర్టీసీ డీఎం మహ్మద్ రఫీ, ఆర్డబ్ల్యూఎస్ ఈఈ పద్మజ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు సహకరించాలి



బంకుల తొలగింపును పరిశీలిస్తున్న ఈవో

పత్తికొండ, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనులకు సహకరించాలని ఈవో నరసింహులు కోరారు. సోమవారం పట్టణం లోని తేరు బజార్‌లో బంకుల తొలగింపును ఆయన పరిశీలించారు. ఈ ప్రాంతంలో హిం దూ ఆలయాలతోపాటు పీర్లచావిళ్లు ఉన్నాయ న్నారు. సీసీ రోడ్డు ఏర్పాటు చేయాలని స్థాని కులు ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబుకు వినతి పత్రం అందించారని, స్పందించిన ఎమ్మెల్యే నిదులు మంజూరు చేయించారని తెలిపారు. రహదారికి ఇరువైపులా మురుగు కాలువల నిర్మాణానికి బంకుల తొలగింపు తప్పనిసరి కావడంతో తొలగిస్తున్నామని తెలిపారు.

బాబోయ్ కుక్కలు



ఆలూరులో సంచరిస్తున్న వీధి కుక్కలు

ఆలూరు, డిసెంబరు23 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో ఏ వీధి చూసిన కుక్కల మందలు కనిపిస్తున్నాయి. అరికెర రోడ్డులో చికెన్, మాంసం దుకాణాలు ఉండడంతో రోడ్లపై కూర్చొని, పాదచారులు, వాహనదారులపై దాడి చేస్తున్నాయి. రాత్రిళ్లు వాహనదారులను వెంబడిస్తున్నాయి. ఇటీవలే బీసీ హాస్టల్ వద్ద ఐటీఐ విద్యార్థి హేమంత్‌ను వెంబడించి గాయపరచాయి. తాజాగా పట్టణంలోని కోయనగర్‌లో చిట్టి అనే యువకుడిని గాయపరిచాయి. కుక్కల సంతతిని నియంతణకు చర్యలు తీసుకోవాలని పశుసంవర్ధక శాఖ అధికారులను కోరినట్లు పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్ తెలిపారు.

టీడీపీతోనే గ్రామాల అభివృద్ధి



కార్యకర్తలతో మాట్లాడుతున్న తుగ్గలి నాగేంద్ర

తుగ్గలి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): టీడీపీ ప్రభుత్వంతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయనీ ఆ పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర అన్నారు. సోమవారం తుగ్గలిలో కార్యకర్తలతో మాటాడుతూ సీఎం చంద్రబాబు విజన్ ఉన్న నాయకుడని, పేదల అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. పత్తికొండ ఎమ్మెల్యే శ్యాంబాబు ప్రజా సేవకు ముందుంటారన్నారు. ఇప్పటికే మండలంలో రూ.2 కోట్ల ఉపాధి నిధులతోతో సీసీ రోడ్లు, మురుగు కాలువలలు నిర్మించామన్నారు. టమోటా రైతులు ఇబ్బందులు పడకుండా పత్తికొండలో టమోటా జ్యూస్ ఫ్యాక్టరీ ఏర్పాటు కానుందన్నారు. రైతు సంఘం ఉపాధ్యక్షుడు బాలన్న, విద్యాకమిటి ఛైర్మన్ మిద్దె రవికుమార్, సర్వేష్ అయూబ్, షాలీబాషా, రాజశేఖర్, రంగస్వామి తదితరులు ఉన్నారు.

మెడికల్ కళాశాల పనులు ప్రారంభించాలి



ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ ముందు బైఠాయించిన నాయకులు

ఆదోని అగ్రికల్చర్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆగిపోయిన ప్రభుత్వ మెడికల్ కళాశాల పనులను వెంటనే ప్రారంభించాలని విద్యార్థి జేఏసీ నాయకులు షాబీర్ బాష, శ్రీను, లింగప్ప, ఉదయ్, అఖండ, రమేష్ డిమాండ్ చేశారు. సోమవారం జేఏసీ నాయకులు ఎమ్మెల్యే పార్థసారథి క్యాంపు ఆఫీస్‌ను ముట్టడించారు. స్పందించిన ఎమ్మెల్యే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పనులు ప్రారంభించేలా చూస్తానని హామీ ఇచ్చారు. శేఖర్, శివ, అశోక్, పవన్, శశి, మల్లికార్జున, మోహన్, వీరేష్, శ్రీకాంత పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరిస్తాం

దేవనకొండ, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ సదస్సులో వచ్చిన భూ సమస్యలను పరిష్కరిస్తామని తహసీల్దార్ లోకేశ్వరయ్య అన్నారు. మండలంలోని వెలమకూరు, తెర్నేకల్ గ్రామాల్లో సోమవారం రెవెన్యూ సదస్సును నిర్వహించారు. వెలమకూరులో 11, తెర్నేకల్‌లో 8 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఆర్‌ఐ విజయ భాస్కర్ రెడ్డి, వీఆర్వో దాదావలి, తదితరులు పాల్గొన్నారు.

గణిత దినోత్సవం

ఆస్పరి, డిసెంబరు23 (ఆంధ్రజ్యోతి): స్థానిక నారాయణ ప్రైమ్ స్కూల్లో సోమవారం ప్రపంచ గణిత దినోత్సవం నిర్వహించారు. శ్రీనివాస్ రామానుజన్ చిత్రపటానికి కరస్పాండెంట్ నరేష్ ఆచారిపూలమాలవేసి నివాళులర్పించారు

అంబేడ్కర్ భవన్‌ను స్వాధీనం చేయండి

ఆలూరు, డిసెంబరు23 (ఆంధ్రజ్యోతి): సచివాలయాన్ని సొంత భవనంలోకి తరలించి అంబేడ్కర్ భవన్‌ను స్వాధీనం చేయాలని ఎమ్మార్పీఎస్ రాయలసీమ జిల్లాల అధ్యక్షుడు చిప్పగిరి లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. సోమవారం ఇన్‌చార్జి ఎంపీడీవో సూర్య నారాయణకు వినతిపత్రం అందించారు. ఏళ్ళప్ప, రామాం జినేయులు, మల్లేష్, మహేష్, వెంకటేష్ పాల్గొన్నారు.

సవరణలు చేయాలి

ఆదోని అగ్రికల్చర్, డిసెంబరు23 (ఆంధ్రజ్యోతి): స్కూల్ కాంప్లెక్స్ పునఃవ్యవస్థీకరణ జాబితాలో సవరణలు చేయాలని ఎస్టీయూ కన్వీనర్ వీరచంద్ర యాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్ నాయుడు కోరారు. ఎంఈవో శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు.

వీఆర్వో మృతి

క్రిష్ణగిరి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎరుకలచెరువు గ్రామ వీఆర్వో గడ్డం విష్ణువర్ధన్ రెడ్డి అనారోగ్యంతో (45) సోమవారం మృతి చెందాడు. తహ సీల్దార్ చంద్రశేఖర్ నివాళి అర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. వీఆర్వోలు రాజశేఖర్‌రెడ్డి, నారాయణ, అయ్యన్న, నాగరత్నమ్మ, వెంకటేశ్వర్లు ఉన్నారు.

బదిలీల్లో అందరికీ అవకాశం ఇవ్వాలి

ఆదోని అగ్రికల్చర్, డిసెంబరు23 (ఆంధ్రజ్యోతి): వేసవిలో నిర్వహించే ఉపాధ్యాయ బదిలీల్లో టీచర్లందరికీ అవకాశం కల్పించాలని ఎస్టీయూ జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి ఎంసీ సుంకన్న కోరారు. మంగళవారం ఎ ప్రాంతీయ కార్యాలయంలో మండల అధ్యక్షుడు చింతకుంట రామకృష్ణ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. 2025 మే ను కటాఫ్‌గా తీసుకుంటే 2017లో బదిలీ, 2023లో పదోన్నతి పొందినవారికి అవకాశం ఉండదని ఆందోళన వ్యక్తం చేశారు. 33 శాతం ఐఆర్ ప్రకటించాని కోరారు. రామాంజనేయులు, అంజనేయ, వేణుగోపాల్ రావు, వెంకటేశ్వర్లు, కోటీశ్వరయ్య, పాల్గొన్నారు.

డీలర్ల భర్తీకి దరఖాస్తులు

వెల్దుర్తి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలో శాశ్వత ప్రాతిపదికన రేషన్ డీలర్ల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు తహసీల్దార్ చంద్రశేఖరవర్మ అన్నారు. దరఖాస్తులు తహసీల్దార్ కార్యాలయంలో లభిస్తాయని, 30వ తేదీ సాయంత్రంలోపు నేరుగా గాని, రిజిస్టర్ పోస్టు ద్వారా ఆర్డీవో కార్యాలయంలో అందచేయాలన్నారు. వచ్చే నెల 5న రాత పరీక్ష నిర్వహిస్తారన్నారు.

చెత్తకుప్పగా మీటింగ్ కట్ట



పట్టణంలో ఓ వెలుగు వెలిగిన మీటింగ్ కట్ట నేడు చెత్తకుప్పగా మారిది. దీన్ని బ్రిటీష్ కాలంలో నిర్మించారు. ఈ వేదిక నుంచి ప్రముఖులు ఎందరో ప్రజలకు సందేశాలు ఇచ్చారు. కళాకారులు తమ ప్రదర్శనలతో ప్రేక్షకులను అలరించారు. ఇటు రాజకీయపార్టీల నాయకులు, సినీ ప్రముఖులు కూడా ఇదే వేదికపై నుంచి ప్రజలతో మాట్లాడారు. వేదిక ఇలా తయారవడంపై ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీన్ని ఉపయోగంలోకి తేవాలని కోరుతున్నారు. **- పత్తికొండ**

నేటి నుంచి టీటీడీ కార్యక్రమాలు

పత్తికొండ టౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో వెంకటేశ్వర దేవస్థానంలో ఈ నెల 24 నుంచి 27వ తేదీ వరకు టీటీడీ యఆధ్వర్యంలో కార్యక్రమాలు చేపడుతున్నట్లు హిందూ ధర్మప్రచార పరిషత్ కార్యనిర్వహకులు డా.మల్లు వెంకటరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఛైర్మన్ అమరావతి శ్రీనివాస్, వీరరాజు, రామలింగయ్య, ప్రముఖ నాటకరంగ కళాకారులు రంగారెడ్డి, కోదండం పాల్గొన్నారు.

కేంద్ర హోంమంత్రిని బర్తరఫ్ చేయాలి

- కొనసాగుతున్న నిరసనలు



ఆలూరులో రాస్తారోకో చేస్తున్న కాంగ్రెస్, ప్రజా సంఘాల నాయకులు

ఆలూరు, డిసెంబరు23 (ఆంధ్రజ్యోతి): పార్లమెంటులో అంబేడ్కర్‌ను కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్ షాను బర్తరఫ్ చేయాలని కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి చిప్పగిరి లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. సోమవారం అంబేడ్కర్ కూడలిలో కాంగ్రెస్, సీపీఐ, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. దేశానికి దిశానిర్దేశం చేసిన మార్గదర్శిని అవమానించేలా చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని, బహిరంగ క్షమాపణ కోరాలన్నారు. అనంతరం ఎస్ఐ దిలీప్ కుమార్‌కు ఫిర్యాదు చేశారు. రామాంజినేయులు, లక్ష్మన్న, మంజునాథ్, గోపాల్, ఎల్లప్ప, వెంకటేష్, మల్లేష్, మహేష్ జాన్ పాల్గొన్నారు.

పదవి నుంచి తొలగించాలి: సీపీఎం

పత్తికొండ టౌన్: రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్ షాను కేంద్ర మంత్రి వర్గం నుంచి తొలగించాలని సీపీఎం కార్యదర్శి వెంకటేశ్వరరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి, ధర్నా చేశారు. దస్తగిరి, గంగన్న, రామాంజనేయులు, రమేష్ పాల్గొన్నారు.

అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి

ఆదోని రూరల్: పార్లమెంటు సాక్షిగా అంబేడ్కర్‌ను అవమానించిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను బర్తరఫ్ చేయాలని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు తిక్కప్ప డిమాండ్ చేశారు. ఈరన్న, నాగేంద్ర, హుసేని, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికతో పారిశుధ్య పనులు చేస్తాం

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

- పంచాయతీ కార్యదర్శి శివకుమార్



మద్దికెర, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మేజర్ గ్రామ పంచాయతీలో ప్రణాళికతో పారిశుధ్య పనులు నిర్వహిస్తామని మద్దికెర గ్రామ పంచాయతీ కార్యదర్శి శివకుమార్ అన్నారు. ఆంధ్రజ్యోతికి ఇంటర్వ్యూ ఇచ్చారు.

ప్రశ్న: మద్దికెర జనాబా ఎంత?

జవాబు: 20వేల మంది ఉన్నారు.

ప్రశ్న: గృహాలు ఎన్ని ఉన్నాయి?

జవాబు: 4,800 గృహాలు ఉన్నాయి. పన్నులు సకాలంలో వసూలు చేస్తున్నాము.

ప్రశ్న: పారిశుధ్య కార్మికులు ఎంత మంది ఉన్నారు?

జవాబు: పంచాయతీ, స్వచ్ఛభారత్ కలిపి 64 మంది పని చేస్తున్నారు. ఉదయం వీధులు శుభ్రం చేయడం, డ్రైనేజీలు, పూడిక తీయడం, రాత్రి దోమల నివారణకు ఫాగింగ్ నిర్వహిస్తున్నాం.

ప్రశ్న:పంచాయతీ స్థలాలను ఆక్రమించారా?

జవాబు: ప్రధాన బస్టాండు నుంచి మెయిన్‌బజారు వరకు పంచాయతీ స్థలాలను ఆక్రమించగా, తొలగించాం. కాలువలను నిర్మించాం.

ప్రశ్న: స్వర్ణ పంచాయతీ కార్యక్రమం ఎలా ఉంది?

జవాబు: సచివాలయ సిబ్బందితో స్వర్ణ పంచాయితీ సర్వే చేస్తున్నాం. కుటుంబ స్థితిగతులను పరిశీలించి, ఇంటి నిర్మాణాల కొలతలు తీసుకుంటాం. ఆన్‌లైన్‌లో పన్నులు వసూలు చేస్తాము.

ప్రశ్న: సీసీ రోడ్ల పనులు చేస్తున్నా?

జవాబు: గ్రామంలో ఇప్పటికే 95 శాతం పూర్తి చేశాం.

ప్రశ్న: పంచాయతీ గదులు నిర్మిస్తున్నారా...?

జవాబు: 24 గదులు నిర్మిస్తున్నాం. వ్యాపారాలు చేసుకునేవారికి వీటిని అద్దెకిస్తున్నాం.

ట్రాఫిక్ తీరు మారేనా?

• ఇబ్బంది పడుతున్న పట్టణ వాసులు
• 12 నెలలుగా ట్రాఫిక్ ఎస్ఐ పోస్టు ఖాళీ

ఎమ్మిగనూరు టౌన్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణంలో ట్రాఫిక్ సమస్య జటిలమవుతోంది. దీంతో పట్టణ వాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు పట్టణంలోని ప్రధాన కూడలిలో వాహనాల రాకపోకలు అధికమవుతుండడంతో ట్రాఫిక్ ఎక్కడికక్కడే నిలిచి పోతుంది. ప్రధానంగా పట్టణంలోని గాంధీ సర్కిల్, గోనెగండ్ల సర్కిల్ నుంచి షరాఫ్ బజార్ ఈ ప్రాంతాలలో రోడ్డు చిన్నగా ఉండడంతో ఎదురెదురుగా వచ్చే వాహనాలతో నిత్యం ట్రాఫిక్ నిలిచిపోతుంది. పెద్ద మసీదు రోడ్డు నుంచి గాంధీ సర్కిల్ వరకు బట్టల,కిరాణ,పెళ్ళి సరుకుల దుకాణాలు ఎక్కువగా వుండడంతో వాటిని కొనుగోలు కోసం గ్రామాల నుంచి వచ్చేవారు ఈ ప్రాంతాల దుకాణాలకు ఎక్కువగా రావడంతో నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తుతుంది. పైగా సింగిల్ రోడ్డు కావడంతో ఈ సమస్య మరింత తీవ్రం అవుతుంది. వేళాపాలా లేకుండా భారీ వాహనాలు గూడ్స్ వాహనాలు సరుకు దింపడం కొరకు దుకాణాల ముందు నిలబెట్టడం వలన రాకపోకలు స్థంబించి పోతున్నాయి. సోమప్ప సర్కిల్, సంతమార్కెట్ నుండి ట్యాంక్ బండ్ రోడ్డు వరకు ఇదే పరిస్థితి వాహన దారులు ఇష్టారీతిన రాకపోకలు కొనసాగిస్తున్నారు. ఆటోలు ఎక్కడపడితే అక్కడ నిలుబెట్టుకోవడం, పండ్ల బండ్ల దుకాణాల ముందు నిలబెడుతూ అవి కాస్త రోడ్డు పైకి చొచ్చుకు రావడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. శివ సర్కిల్, సోమప్ప సర్కిల్, వైఎస్ సర్కిల్, గోనెగండ్ల సర్కిల్, సంత మార్కెట్ సర్కిల్, షరాఫ్ బజార్, కలుగొట్ల రోడ్డు,కమిటీ సర్కిల్, ఈ సర్కిల్‌లు నిత్యం రద్దీగా వుంటాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ పోలీసులు వుండి పర్యవేక్షణ చేయాల్సి ఉన్నది. అయితే ప్రస్తుతం పూర్తిస్థాయిలో జరగడం లేదు. కేవలం ఒకటి,రెండు సర్కిల్‌లో పర్యవేక్షణ చేస్తున్నారు. దీంతో ఆయా సర్కిల్‌ల్లో ట్రాఫిక్ సమస్య నిత్యం ఏర్పడుతూనే ఉన్నది. అన్నమయ్య సర్కిల్ నుంచి కమిటీ రోడ్డు వరకు హైవే రోడ్డు అవడం వలన ట్రాఫిక్ నియంత్రణ లేకుండా పోతుంది. నిత్యం యాక్సిడెంట్‌లు జరుగుతుండడా నికి ఆవకాశం ఎక్కువ ఉన్నాయి. ఆయా సర్కిల్‌లో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకునే అవసరం వుంది. జనవరిలో ఎమ్మిగ నూరులో పెద్ద ఎత్తున్న జాతర జరుగుతుంది. జాతరను చూడడానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు తండోప తండాలుగా తరలివ స్తారు. సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండాలంటే ట్రాఫిక్ నియంత్రణ అవసరం ఎంతైనా ఉంది.

ఖాళీగా ట్రాఫిక్ ఎస్ఐ పోస్టు

పట్టణ పోలీస్ స్టేషన్‌కు అనుసంధానంగా ట్రాఫిక్ విభాగాన్ని సైతం ఉన్నత పోలీసు అధికారులు ఏర్పాటు చేశారు. ఈ పోస్ట్ ఖాళీ అయి 12నెలలు అయింది. ఇంత వరకు ఇక్కడ ఎవరు నియామకానికి నోచుకోలేదు. అలాగే ట్రాఫిక్ విభాగంలో మొత్తం ఎనిమిది మంది పోలీసులు వుండాల్సి వుంది. కాని నలుగురు పోలీసులు మాత్రమే వున్నారు. ఇద్దరు హెడ్ కానిస్టేబుల్ వుండాల్సిన చోట ఒక్కరు వుండడం గమనార్హం. సరైన సిబ్బంది లేకపోవడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. ఎస్సై పోస్టు వెంటనే భర్తీ చేయడంతో పాటు ట్రాఫిక్ సమస్య లేకుండా చూడాలని పట్టణ వాసులు కోరుతున్నారు.


రోడ్డుపైనే నిలిచి ఉన్న ఆటో

రద్దీని నియంత్రించేందుకు చర్యలు

ట్రాఫిక్ రద్దీని నియంత్రించడానికి ఎప్పటికప్పుడు చర్యలు చేపడుతున్నాం. ఎవరైతే నిబంధనలు పాటించరో వారికి జరిమానాలు విధిస్తూ అవగాహన కల్పిస్తున్నామన్నారు. ట్రాఫిక్ సిబ్బంది తక్కువగా ఉన్న మాట నిజమే. సిబ్బంది కొరత ప్రతి స్టేషన్‌లోను ఉంది. ప్రస్తుతం రిక్రూట్‌మెంట్ జరుగుతుంది. దాని తరువాత సిబ్బంది సమస్య పరిష్కారం అవుతుందన్నారు. ట్రాఫిక్ ఎస్సై కావాలని పై అధికారులకు కూడా తెలిపాం. సానుకూలంగా స్పందించారన్నారు.

\- శ్రీనివాసులు, పట్టణ సీఐ

వైభవంగా చెక్క రథోత్సవం


చెక్క రథంపై ఊరేగుతున్న ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు చెక్కరథంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. సోమవారం ధనుర్మాసం నవమి శుభ దినాన్ని పురస్కరించుకుని మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆధ్వర్యంలో రాఘవేంద్రస్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పీఠాధిపతి పూర్ణ బోధ పూజ మందిరంలో మూల రాములు, జయరాములు, దిగ్విజరాములకు బంగారు నాణేలతో అభిషేకం చేసి హారతులు ఇచ్చారు. చెక్క రథంపై ఉత్సవ మూర్తి ప్రహ్లాదరాయలను ఊరేగించారు. ఉత్సవమూర్తికి ఊంజలసేవ నిర్వహించి హారతులిచ్చారు. వివిధ రాష్ట్రాల నుంచి పెద్దఎత్తున తరలి వచ్చిన భక్తులతో శ్రీమఠం ప్రాంగణం కిక్కిరిసింది. భక్తులకు పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు శేష వస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వాదించారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఒకే ఒక్కరు


తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికకు హాజరైన డిప్యూటీ తహసీల్దార్ గీత

పెద్దకడుబూరు , డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రతీ సోమవారం మండల కేంద్రాల్లో నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక గాడి తప్పుతోంది. ప్రభుత్వం ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు వారంలో ఒకరోజు ప్రజావేదికను నిర్వహిస్తారు. ఈ ప్రజా వేదికకు దాదాపుగా 18శాఖల అధికారులు హాజరుకావాల్సి ఉండగా, కేవలం ఐదుగురు మాత్రమే హాజరవుతున్నారు. వచ్చిన కొన్ని శాఖల అధికారులు కూడా నామమాత్రంగా వచ్చి సంతకాలు చేసి వెళ్లిపోతున్నారు. చివరికి ప్రజావేదికలో రెవెన్యూ శాఖ అధికారుల్లో ఎవరో ఒకరు మాత్రమే ఉండిపోతున్నారు. సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వెలుగు ఏపీఎం, ఉపాధి హామీ నుంచి ఏపీవో, టీబీపీ, ఎల్లెల్సీ అధికారి, ఐసీడీఎస్, రెవెన్యూ శాఖ నుంచి డిప్యూటీ తహసీల్దార్ మాత్రమే హాజరయ్యారు. ఇందులో డిప్యూటీ తహసీల్దార్ గీతాప్రియదర్శిని తప్ప వచ్చిన నాలుగు శాఖల అధికారులు సంతకాలు చేసి వెళ్లిపోయారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

మంత్రాలయం, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం మండలంలోని మాధవరం గ్రామంలో ప్రైవేటు బస్సు, లారీ ఢీకొన్నాయి. దీంతో ప్రమాదం త్రుటిలో తప్పింది. ఈ సంఘటన ఆదివారం అర్ధరాత్రి జరిగింది. మాధవరం నుంచి ప్రైవేటు ట్రావెల్ బస్సు మంత్రాలయం వెళ్తుండగా.. మంత్రాలయం నుంచి మాధవరం వస్తున్న లారీని ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఇరువురి డ్రైవర్లు అప్రమత్తం కావడంతో ప్రయాణికులకు ప్రమాదం తప్పింది. బస్సు, లారీ ముందు భాగాలు పూర్తిగా దెబ్బ తిన్నాయి. గ్రామంలో జరగడంతో పెద్ద శబ్దం రావడంతో గ్రామస్థులు ఉలిక్కిపడ్డారు.

రేషన్ దుకాణానికి దరఖాస్తు చేసుకోవాలి

గోనెగండ్ల, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మూడు గ్రామాల్లో రేషన్ దుకాణాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తహసీల్దార్ కుమారస్వామి సోమవారం తెలిపారు. గోనెగండ్ల (జనరల్), చిన్ననేలటూరు (ఎస్సీ), బైలుప్పల(ఎస్టీ) గ్రామాల్లో దుకాణాలు ఉన్నట్లు వెల్లడించారు. అర్హులైన వారు ఆయా దుకాణాలకు ఈనెల 30 తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. జనవరి 5న పరీక్ష, 6న ఇంటర్వ్యూ ఉంటుందని ఆయన తెలిపారు.

భూ సమస్యలే ఎక్కువ: తహసీల్దార్


వినతులను స్వీకరిస్తున్న తహసీల్దార్ శేషఫణి

ఎమ్మిగనూరు రూరల్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు తహసీల్దార్ కార్యాలయంలో ప్రతీ సోమవారం నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అధికంగా భూ సమస్యలే వస్తున్నాయి. సోమవారం నిర్వహించిన సమావేశంలో కూడా భూ సమస్యలే అధికంగా వచ్చాయని తహసీల్దార్ శేషఫణి తెలిపారు. తమ దృష్టికి వచ్చిన సమస్యలను ఉన్నతాధికారులకు తెలిపి వెంటనే పరిష్కరిస్తామన్నారు. ఇదిలా ఉండగా ప్రతి సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అధికారులు పూర్తిస్థాయిలో హాజరు కాకపోవడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కొన్నిశాఖల అధికారులు అయితే అసలే హాజరు కావడం లేదని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రతి సమస్యను పరిష్కరిస్తాం


మాట్లాడుతున్న తహసీల్దార్ రవి

మంత్రాలయం, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులో దరఖాస్తు చేసుకున్న ప్రతి రైతు సమస్యను పరిష్కరించి న్యాయం చేస్తామని తహసీల్దార్ ఎస్.రవి అన్నారు. సోమవారం దిబ్బనదొడ్డి గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొలం తగాదాలు, ఆన్‌లైన్‌లో తప్పిదాలు, కొలతల్లో తారుమారు, మ్యుటేషన్, సరిహద్దుల విబేదాలు వంటి అంశాలపై దరఖాస్తు చేసుకున్న వారికి న్యాయం చేసేందుకు ప్రతి అధికారి కృషి చేస్తున్నామన్నారు. రెవెన్యూ సదస్సులను గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వీఆర్వో ఆనంద్, సర్వేయర్ రైతులు పాల్గొన్నారు.

నేడు కలుగొట్లలో రెవెన్యూ సదస్సు

ఎమ్మిగనూరు రూరల్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మండల పరిధిలోని కలుగొట్ల గ్రామంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ శేషఫణి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలుగొట్ల గ్రామంలో ఉన్న రైతులు భూ సమస్యలు ఏవైనా ఉంటే ఈ సదస్సులో ఫిర్యాదు చేసి పరిష్కరించుకోవాలని ఆయన కోరారు.

క్రిస్మస్‌కు చర్చిలు ముస్తాబు


మాధవరం, నందవరం, గోనెగండ్లలో విద్యుద్దీపాలంకరణలో చర్చిలు

మంత్రాలయం, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): క్రైస్తవులు ఎంతో పవిత్రంగా జరుపుకునే క్రిస్మస్ పండుగ వేడుకలకు చర్చిలు ముస్తాబవుతున్నాయి. ఈ నెల 25న జరుపుకునే క్రిస్మస్ వేడుకలకు సీఎస్ఐ, ఎండీ, ఆర్‌సీఎం, మార్థోమ వంటి చర్చిలు సుందరంగా విద్యుద్దీపాలతో అలంకరణ చేశారు. క్రిస్మస్ ట్రీలు, శాంతా క్లాజ్, స్టార్లు వంటివి అలంకరించారు. సీఎస్ఐ డివిజనల్ ఛైర్మన్ రెవ.వేదనాయకం, జాన్‌వెస్లీ, రాజన్న, ఏసురాజుల ఆధ్వర్యంలో ఇంటింటికి క్రిస్మస్ క్యాండిల్ లైటింగ్ సర్వీసు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మంత్రాలయం, మాధవరం, రచ్చుమర్రి, మాలపల్లి, తుంగభద్ర, చిలకలడోన, తిమ్మాపురం, చెట్నహల్లి గ్రామాల్లో క్రీస్తు పుట్టుక పశువుల పాకను సుందరంగా తీర్చిదిద్దారు. క్రిస్మస్ పురస్కరించుకుని పౌరాణిక నాటకాల ప్రదర్శనకు సిద్ధం చేస్తున్నారు.

గోనెగండ్ల: మండలంలోని పలు గ్రామాల్లో కిస్మస్ వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. దాంతో గ్రామాల్లో సందడి నెలకొంది. మండలంలో చర్చిలను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. క్రిస్మస్ ట్రీ ఏర్పాటు చేశారు. క్రిస్మస్ గీతాలను ఆలపిస్తూ సంబరాలను చేసుకుంటున్నారు. రాత్రివేళ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

నందవరం: మండలంలో క్రిస్మస్‌కు చర్చిలు ముస్తాబయ్యాయి. మండలంలోని ముగతి, హాలహర్వి, మిట్టసోమాపురం, నందవరం, ఇబ్రహింపుం, మాచాపురం గ్రామాల్లో చర్చిలను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

ప్రతి కార్యకర్తకు సభ్యత్వం


సభ్యత్వం అందజేస్తున్న టీడీపీ నాయకులు

నందవరం, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రతి కార్యకర్తకు ఉచితంగా సభ్యత్వం చేయిస్తానని డిష్ అధినేత గురురాజా రావు అన్నారు. సోమవారం నందవరంలో ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు దేశాయి నెట్ వర్క్ కార్యాలయంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. మండలంలోని అన్ని గ్రామాల్లో దాదాపు 2000మందితో సభ్యత్వ నమోదు కార్యక్రమాలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రామన్నగౌడు, సాదిక్, శివ పాల్గొన్నారు.

గంజహళ్లిలో డెంగీ కేసు నమోదు


మురుగు కాలువలో దోమల మందు పిచికారి చేస్తున్న సిబ్బంది

గోనెగండ్ల, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలో గంజహళ్లి గ్రామంలో మూడేళ్ల పిల్లవాడికి డెంగీ సోకిందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆదోని డివిజన్ మలేరియా నివారణ అధికారి సాయిబాబా అన్నారు. సోమవారం మండలంలోని గంజహళ్లి గ్రామంలో వైద్య శాఖ సిబ్బందితో కలిసి ఆయన పర్యటించారు. అధికారులు మురికి వాడలలో పర్యటించి అక్కడి వారికి ఆరోగ్యసూత్రలను వివరించారు. వైద్యశిబిరాలను ఏర్పాటు చేశారు. రోగులకు జ్వరం, దగ్గు, జలుబు, ఇతర వ్యాధులు ఉన్నవారికి ఉచితంగా మందులను అందజేశారు. అనారోగ్యం ఉన్నట్లైతే వెంటనే గోనెగండ్ల ప్రభుత్వ అనుపత్రికి రావాలని వైద్యసిబ్బంది గ్రామస్థులకు సూచించారు. కార్యక్రమంలో హనుమంతు, పరమేష్, గ్రామ పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, ఆశా వర్కర్లు, శాంతమ్మ పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: డీఎస్పీ

నందవరం, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్లతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ ఉపేంద్రబాబు సూచించారు. సోమవారం రాత్రి ఆయన మండలంలోని ముగతి గ్రామంలోని మంత్రాలయం రోడ్డు సర్కిల్ దగ్గర ఎస్ఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఫోన్ చేసి సమాచారం అడిగే వారి ఫోన్లు కట్ చేయాలన్నారు. వాహనదారులు హెల్మెట్ తప్పని సరిగా ధరించాలన్నారు. పొలం తగదాలుంటే అధికారుల దగ్గరకు వచ్చి పరిష్కరించుకోవాలన్నారు. చిన్నదానికి రైతులు ఘర్షణలు పడొద్దన్నారు. రాత్రిళ్ల రైతులు పొలాలకు వెళ్లేటప్పుడు జాగ్రత్త పాటించాలన్నారు. విషపురుగులు ఉంటాయని టార్చ్‌లైట్ ఉండాలని గుర్తు చేశారు. సమాచారం కోసం 108కు డయల్ చేయాలన్నారు.

రామలింగేశ్వర స్వామికి పూజలు

మంత్రాలయం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయంలో ఓల్డ్ టౌన్‌లో శ్రీరాముడి చేత ప్రతిష్ఠించిన రామలింగేశ్వరస్వామికి పూజలు నిర్వహించారు. సోమవారం ధనుర్మాసం పురస్కరించుకుని బిల్వార్చన, 108 బిల్వ పత్రాలతో అష్టోత్తర పారాయణం, రుద్రాభిషేకం, విశేష పంచామృతాభిషేకం వంటి పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పుష్పాలు, కవచం, బంగారు, వెండి ఆభరణాలతో చూడముచ్చటగా అలంకరించారు. సూర్యభగవానుడు ఉదయించేలోపే పూజలు చేసి అనంతరం భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అర్చకులు వీరేష్ స్వామి తీర్థప్రసాదాలు అందజేశారు.

జగ్గీత్ సింగ్ ప్రాణాలను కాపాడాలి



ధర్నా నిర్వహిస్తున్న ఏఐకేఎంఎస్, ఐఎఫ్‌టీయూ నాయకులు

ఎమ్మిగనూరు టౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీకి పాదయాత్ర చేస్తున్న రైతులను ఆపాలని, రైతు నాయకుడు జగ్గీత్‌సింగ్ ప్రాణాలను కాపాడాలని ఏఐకేఎంఎస్, ఐఎఫ్‌టీయూ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ సమితి పిలుపు మేరకు పట్టణంలో సోమప్ప సర్కిల్‌లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి సత్యన్న, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు బాలరాజు మాట్లాడుతూ ఎన్డీఏ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్య పాలన సూత్రాలు కట్టుబడి ఉండకపోవడాన్ని నిరసిస్తున్నట్లు తెలిపారు. రైతు నాయకుడు జగ్గీత్ సింగ్ ప్రాణాలను కాపాడేలా కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని, ఢిల్లీకి పాదయాత్ర చేస్తున్న రైతులపై బాష్పవాయువు ప్రయోగాలు ఆపాలన్నారు. గత 21రోజులుగా లగ్గర్ జైల్లో ఉన్న రైతులందరినీ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జాతీయ వ్యవసాయ మార్కెట్ విధానం,డిజిటల్ అగ్రికల్చర్ మిషన్ మరియు నేషనల్ కో ఆర్డినేషన్ పాలసీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘాల నాయకులు నాగేంద్ర, ఎల్లప్ప, పెద్దారెడ్డి, జయరాజు, యూసఫ్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి


పంచాయతీ కార్యదర్శికి వినతి పత్రం ఇస్తున్న నాయకులు

గోనెగండ్ల, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో రోజు రోజుకు తాగునీటి సమస్య తీవ్రతరం అవుతోందని, పరిష్కరించాలని జనసేన నాయకులు గానుగ బాషా, మాలిక్ బాషా, సుభాన్ కోరారు. సోమవారం గ్రామ పంచాయతీ కార్యదర్శి సతీష్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు మాసాలుగా గ్రామంలో నీటి సరఫరా సక్రమంగా లేకపోవడంతో ప్రజలకు తాగునీటి కష్టాలు తప్పడం లేదన్నారు. ఇందుకు స్పందించిన కార్యదర్శి సతీష్ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామని అన్నారు.

పల్లె రహదారులు అధ్వానం

గోనెగండ్ల, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): గోనెగండ్ల మండలంలోని పల్లెల రహదారులు అధ్వానంగా మారాయి. చిన్న పాటి చినుకుల పడితే రహదారులు చిత్తడిగా మారుతున్నాయి. దాంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. బైలుప్పల నుంచి తెర్నెకల్లు, బన్నూరు గ్రామాలకు వెళ్లే రహదారి గుంతలమయంగా మారాయి. ఈ ప్రాంతంలో డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో నీరు రోడ్లపై నిలిచి కుంటను తలపిస్తోంది. దీంతో ద్విచక్ర వాహనాలకు, ఆటోల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అగ్రహారం వెళ్లే దారిలో కూడా గంతలు పడ్డాయి. ఇక్కడ కూడా వర్షం పడితే చిత్తడిగా మారుతుంది.


రోడ్డుపై పడ్డ గుంతల్లో నిలిచిన నీరు

మిరపకు మద్దతు ధర ప్రకటించాలి


మాట్లాడుతున్న రామచంద్రయ్య

పెద్దకడుబూరు , డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): మిరపకు రూ. 25వేలు మద్దతు ధరను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు రామచంద్రయ్య, రాష్ట్ర కార్యదర్శి జగన్నాథం, జిల్లా కార్యదర్శి పంపన్న గౌడ్, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి తిమ్మప్పలు డిమాండ్ చేశారు. సోమవారం పెద్దకడబూరులో జిల్లాస్థాయి రైతు సదస్సును రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అంజనేయ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా రైతు విమోచన చట్టాన్ని తీసుకురావాలన్నారు. మార్కెట్‌లో మిరప పంటకు గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. వీటి వల్ల రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ తదితర పథకాలును అమలు పరచడంలో ఘోరంగా విఫలం అయ్యారన్నారు. పెండింగ్‌లో ఉన్న గుండ్రెవుల, వేదవతి ప్రాజెక్టులు పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించాలన్నారు. రైతులకు కనీస మద్దతు ధర చట్టాన్ని తెచ్చేందుకు రైతు సంఘం అలుపెరుగని పోరాటం చేస్తుందన్నారు. సమావేశంలో రైతు సంఘం సీనియర్ నాయకులు లక్ష్మిరెడ్డి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు భాస్కర్ యాదవ్, మండల కారదర్శి వీరేష్, రైతు సంఘం నాయకులు, రైతులు పాల్గొన్నారు.

మూగలదొడ్డిలో భారీ మొసలి

తాళ్లతో బంధించిన ఫారెస్టు అధికారులు, గ్రామస్థులు


మూగలదొడ్డిలో భారీ మొసలిని బంధించిన గ్రామస్థులు

కోసిగి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మూగలదొడ్డి గ్రామంలో భారీ మొసలి కంట పడింది. గ్రామానికి చెందిన రైతు దౌళ్ల వీరారెడ్డి పొలం సమీపంలో దస్తగిరి తాతా కట్ట దగ్గర ముళ్ల చెట్ల మధ్యలో సుమారు 200 కేజీల బరువు, తొమ్మిది అడుగుల పొడవు ఉన్న భారీ మొసలిని రైతులు, గ్రామస్థులు గుర్తించారు. సోమవారం మధ్యాహ్న సమయంలో గ్రామానికి చెందిన ఓ వ్యక్తి పశుగ్రాసం కోసం వెళ్లి వస్తుండగా.. శబ్దం విని అటుగా చూస్తే మొసలి కంట పడింది. వెంటనే అప్రమత్తమై గ్రామస్థులకు, రైతులకు సమాచారం ఇచ్చాడు. వెంటనే గ్రామస్థులు సర్పంచ్‌కు, ఫారెస్టు అధికారులకు సమాచారాన్ని చేరవేశారు. సాయంత్రం ముళ్లపొదల్లో ఉన్న మొసలిని ఫారెస్టు అధికారులు, గ్రామస్థులు తాళ్లతో బంధించి బయటకు తీశారు. భారీ మొసలి కంట పడటంతో ఒక్కసారిగా మూగలదొడ్డి గ్రామస్థులు భయాందోళనలకు గురయ్యారు.

కర్ణాటక మద్యం స్వాధీనం


పట్టుబడిన కర్ణాటక మద్యం చూపుతున్న ఎస్ఐ చంద్రమోహన్

కోసిగి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలో కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకుని మూడు బైకులను సీజ్ చేసినట్లు ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు. సోమవారం మండల పరిధిలోని ఐరంగల్ రైల్వేగేటు సమీపంలో డి.బెళగల్ గ్రామానికి చెందిన బోయ చిన్న నరసన్న, బోయ నాగరాజు అనే వ్యక్తులు రెండు మోటారు సైకిళ్లపై 2,112 టెట్రా 90 ఎంఎల్ టెట్రా ప్యాకెట్లు తరలిస్తుండగా.. దాడులు చేసి పట్టుకున్నామన్నారు. అలాగే మూగలదొడ్డి క్రాస్ రోడ్డు వద్ద అదే గ్రామానికి చెందిన బోయ హరికృష్ణ బైక్‌పై 576 టెట్రా 90 ఎంఎల్ ప్యాకెట్లు పట్టుకున్నట్లు తెలిపారు. అయితే ఇందులో డి.బెళగల్ చెందిన బోయ నాగరాజు, మూగలదొడ్డి గ్రామానికి చెందిన బోయ హరిక్రిష్ణ, పరారైనట్లు తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి చిన్న నర్సన్న అనే వ్యక్తిని రిమాండ్‌కు తరలించామన్నారు. ఈ దాడుల్లో పోలీసు సిబ్బంది ఉన్నారు.

● **పేకాటరాయుళ్ల అరెస్టు:** పేకాట రాయుళ్లను అరెస్టు చేసినట్లు కోసిగి ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు. మండల పరిధిలోని దుద్ది గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయం వెనుక ఖాళీ ప్రదేశంలో కోసిగికి చెందిన నలుగురు వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు సమాచారం వచ్చింది. దాంతో సిబ్బంది దాడులు నిర్వహించి వారిని పట్టుకుని రూ.1,530ల నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. మరో ముగ్గురు పరారీలో ఉన్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఘనంగా రామానుజన్ జయంతి

నందవరం, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జడ్పీ పాఠశాలలో గణిత మేధావి రామానుజన్ జయంతిని సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ముందుగా రామానుజన్ చిత్రపటానికి హెచ్ఎం శివరాం పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బసవరాజు, ఈరన్న, విజయలక్ష్మీ, ప్రమీల, నరసన్న పాల్గొన్నారు.